
దొరసామిరోడ్డులో కూలిన చెట్టు తొలగిస్తున్న కార్మికుడు

నగరంలో భారీ వర్షం

● పొంచి ఉన్న వాయు'గండం'

చెన్నై, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): నగరంలో, సబర్బన్ ప్రాంతాల్లో శుక్రవారం అర్ధ రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు భారీ వర్షం కురిసింది.గత మూడు రోజులుగా పగటిపూట ఎండ వేడి, రాత్రిపూట చెదురుమదురుగా వర్షాలు కురిశాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం చిరుజల్లుతో ప్రారంభమైన వర్షం అర్ధరాత్రి కుండపోతగా మారింది. ఎగ్మూరు, పురుషవాక్కం, ప్యారీస్ కార్నర్, కోయంబేడు, అన్నానగర్, ముగపేర్, అయనవరం, విల్లివాక్కం, అశోక్‌నగర్, మైలాపూరు, చోళవరం, తాంబరం, వండలూరు తదితర ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులు, పిడుగులతో వర్షాలు కురిశాయి. శనివారం వేకువజాము కూడా నగరంలోని పలు ప్రాంతాల్లో చెదురుమదురుగా వర్షం


వర్షంలో కోయంబేడు వందడుగుల రోడ్డులో వెళ్తున్న వాహనాలు

కురవడంతో పలు ప్రాంతాల్లో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

కూలిన 17 చెట్లు...

నగరంలో శుక్రవారం రాత్రి కురిసిన వర్షాలకు 17 చోట్ల చెట్లు కూలిపడ్డాయి. కార్పొరేషన్ కార్మికులు, ఆయా ప్రాంతాల్లోని అగ్నిమాపక సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన కూలిన చెట్లను తొలగించారు. ఇది ఇలా ఉండగా ఈ నెల 25న బంగాళాఖాతంలో అల్పవాయుపీడనం ఏర్పడే అవకాశాలున్నాయని, దాని ప్రభావంతో నగరంలో, తిరువళ్లూరు, చెంగల్పట్టు, కాంచీపురం జిల్లాల్లో ఓ మోస్తరుగా వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నట్లు స్థానిక వాతావరణ పరిశోధన కేంద్రం అధికారులు తెలిపారు.

రిజర్వాయర్లలో పెరిగిన నీటిమట్టం...

గత మూడు రోజులుగా చెన్నై, తిరువళ్లూరు పరిసర ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు నగరానికి తాగునీటిని సరఫరా చేసే జలాశయాల్లో నీటిమట్టం క్రమంగా పెరుగుతోందని అధికారులు తెలిపారు. పుళల్, పూండి, చోళవరం, కన్నన్‌కోట- తేర్వాయ్ కండిగ, చెంబరంబాక్కం జలాశయాల పరీవాహక ప్రాంతాల్లో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. పూండి రిజర్వాయర్‌లో 3231 మిలియన్ల ఘనపుటడుగుల వరకు నీటిని నిల్వ చేసే అవకాశం ఉండగా శనివారం సాయంత్రం నీటిమట్టం 2351 మిలియన్ల ఘనపుడుగుల మేర పెరిగింది. నగరానికి ఆ జలాశయం నుండి సెకనుకు 297 ఘనపుటడుగులు చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. పుళల్ జలాశయంలో 3330 మిలియన్ల ఘనపుటడుగుల మేర నీరు నిల్వ చేసేందుకు వీలుండగా ప్రస్తుతం 2972 మిలియన్ల ఘనపుటడుగుల మేర నీటి మట్టం పెరిగింది. చెంబరంబాక్కంలో నీటిమట్టం 945 మిలియన్ల ఘనపుటడుగుల మేర పెరిగింది. నగరానికి తాగునీటి అవసరాల కోసం సెకనుకు 195 ఘనపుటడుగుల చొప్పున నీరు విడుదల చేస్తున్నారు. రెవెన్యూ అధికారుల సమాచారం మేరకు శనివారం ఉదయం వరకు చోళవరంలో 131 మి.మీ., తిరుత్తణిలో 131 మి.మీ, తిరువళ్లూరులో 113 మి.మీ, తామరైపాక్కంలో 83 మి.మీ. గుమ్మిడిపూండిలో 55 మి.మీ. చొప్పున వర్షపాతం నమోదైంది. రెడ్‌హిల్స్‌లో 48 మి.మీ., పూందమల్లిలో 62 మి.మీ., ఊత్తుకోటలో 43 మి.మీ., ఆవడిలో 40 మి.మీ., పొన్నేరిలో 38 మి.మీ. వర్షపాతం నమోదైంది.


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు (ఇన్‌సెట్‌లో) సుగంధద్రవ్యాల మాలలు ధరించి ఇష్టదేవేరులతో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

నేత్రపర్వంగా ఆవణి రథోత్సవం

● తిరుచెందూరులో భక్తజన సందడి

చెన్నై, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): తిరుచెందూరు సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ఆవణి ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం రథోత్సవం కనులపండువగా జరిగింది. ఆలయంలో ఆవణి ఉత్సవాలు ఈ నెల 14న ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి, రోజూ ఉదయం, సాయంత్రం స్వామివారు వళ్ళి దైవానై సమేతుడై వివిధ వాహన సేవలందుకున్నారు. ఈ ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన రథోత్సవం శనివారం ఉదయం ఏడు గంటలకు ప్రారంభమైంది. ముందుగా వినాయకుడి రథం బయలుదేరగా, తర్వాత ఉదయం 7.30 గంటలకు 'కుమారవిడంగ పెరుమాళ్' వళ్ళి దైవానై సమేతుడై సర్వాలంకరణ శోభితుడైన రథంలోని ప్రత్యేక పీఠంపై ఆశీనులయ్యారు. ఆ తర్వాత భక్తులు రథం మోకుతాళ్లు పట్టుకుని లాగుతూ వెళ్ళారు. ప్రధాన వీధుల్లో ఊరేగిన తర్వాత రథం ఉదయం 8.40 గంటలకు రథమండపానికి చేరింది. తర్వాత వళ్ళిదేవి రథం బయలుదేరింది. ఈ వేడుకలకు ఆలయ తక్కర్ అరుళ్‌మురుగన్ తగు ఏర్పాట్లు చేపట్టారు. ఆదివారం సాయంత్రం స్వామి, అమ్మవారికి యాదవ మండకపడి వద్ద అభిషేకం, అలంకారం నిర్వహించనున్నారు. రాత్రి పుష్పసప్పరాలలో తెప్పకొలను మండప ప్రాంతానికి వేంచేయనున్నారు. సోమవారం సాయంత్రం ధ్వజావరోహణంతో ఈ ఉత్సవాల ముగియనున్నాయి.

● రాష్ట్రాల హక్కులు హరిస్తున్నారంటూ సీఎం స్టాలిన్ ధ్వజం

కేంద్రమా.. ఇది న్యాయమా?

చెన్నై, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర రాష్ట్రాల మధ్య సన్నిహిత సంబంధాలను పెంపొందించేదిశగా ఎన్నో కమిటీలు ఏర్పాటైనా కేంద్రం రాష్ట్రాల హక్కులను హరించివేయడమే పనిగా పెట్టుకుందని, జీఎస్టీ ద్వారా ఎక్కువగా ఆదాయం ఇచ్చే రాష్ట్రాలకు సరిపడా నిధులను విడుదల చేయకుండా ముప్పుతిప్పలు పెట్టడం భావ్యమేనా అని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ మండిపడ్డారు. కొత్త చట్టాలు తీసుకొచ్చి, రాష్ట్రాల హక్కులన్నింటినీ గుప్పిట్లో పెట్టుకుని ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉండే రాష్ట్రాలపై పెత్తనం చెలాయిస్తోందని ఆరోపించారు. చేపాక్‌లోని కలైవానర్ అరంగంలో కేంద్ర, రాష్ట్రాల సంబంధాలపై శనివారం జరిగిన జాతీయ సదస్సులో పాల్గొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంబంధాలపై ప్రజాభిప్రాయ సేకరణ కోసం ప్రత్యేక వెబ్‌సైట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల హక్కులను హరించకూడదనే స్ఫూర్తితో 50 యేళ్ళలో సమాఖ్యవాదానికి వ్యతిరేకంగా జరిగిన సంఘటనలను అధ్యయనం చేసి, అవసరమైన రాజ్యాంగ సవరణలు చేయడానికి కేంద్ర రాష్ట్రాల మధ్య సన్నిహిత సంబంధాలను పెంపొందించే దిశగా విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కురియన్ జోసెఫ్ నేతృత్వంలో ఉన్నత స్థాయి కమిటీని తమ ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తెలిపారు. 1983లో కర్ణాటకలో జరిగిన దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం తర్వాత అప్పటి కేంద్రం సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి సర్కారియా నేతృత్వంలో ఓ కమిటీని ఏర్పాటు చేసిందని, ఆ కమిషన్ రాష్ట్రాలకు మరిన్ని అధికారులు కల్పించేలా తగని సిఫారసులు చేయలేదని తాను భావిస్తున్నట్లు చెప్పారు. ఆ తర్వాత ఏర్పాటైన జస్టిస్ పూంఛీ కమిషన్ కూడా నిష్పక్షపాతంగా వ్యవహరించే వారినే గవర్నర్లుగా నియమించాలని సిఫారసు చేసిందని, ఇలా వరుసగా కమిటీలు చేసిన ప్రతిపాదనలు అమలుకు నోచుకోకపోగా కేంద్రం కొత్త చట్టాలు తీసుకువచ్చి రాష్ట్రాల హక్కులను హరించి వేస్తోందని స్టాలిన్ ఆరోపించారు. ద్రవిడ ఉద్యమనేతలు పిట్టి త్యాగరాయర్, డాక్టర్ నటేశన్, డాక్టర్ టీఎం నాయర్ ఉద్యమాల ద్వారా రాష్ట్రంలో సామాజిక న్యాయాన్ని ఏర్పాటు చేశారని, వందేళ్లుగా రాష్ట్రంలో రిజర్వేషన్ల విధానాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. ద్రావిడ సిద్ధాంతాల రూపకర్తలైన పెరియార్, అన్నాదురై, కరుణానిధి కూడా సమానత్వం, మహిళా హక్కుల సాధనకోసమే పోరాడారని చెప్పారు. సర్వహక్కులను హస్తగతం చేసుకున్న కేంద్రం రక్తపీడనంతో ఉండగా, రాష్ట్రాలు రక్తహీనతతో బాధపడుతున్నాయని అభివర్ణించడం సమంజసంగా ఉంటుందన్నారు. గత నాలుగేళ్లుగా రాష్ట్రంలో సుపరిపాలనను అందిస్తున్నామని, ఆర్థికపరంగా పురోభివృద్ధి చెందుతున్న ఈ రాష్ట్రంలో అమలు చేస్తున్న పథకాలపై ఇతర రాష్ట్రాలు దృష్టిసారిస్తున్నాయని, రాష్ట్రాలు స్వయం ప్రతిపత్తి కలిగి ఉండాలన్నదే తమ ఆశయమన్నారు. నాలుగేళ్లుగా కేంద్రం ఎన్నిరకాలుగా ఇబ్బందులు పెట్టినా రాష్ట్ర ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసి ద్రావిడ తరహా సుపరిపాలన అందిస్తున్నామన్నారు. ఈ సదస్సులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సన్నిహిత సంబంధాలను పునరుద్ధరించే దిశగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ చైర్మన్, సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కురియన్ జోసెఫ్, సభ్యులు అశోక్ వర్ధన్ శెట్టి, డాక్టర్ నాగనాధన్ పాల్గొన్నారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్, మంత్రులు తంగం తెన్నరసు, ఆర్ఎస్ రాజ కన్నప్పన్, పీకే శేఖర్‌బాబు, కోవి చెళియన్, కేరళ మాజీ మంత్రి థామస్ ఐజాక్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్. మురుగానందం తదితరులు హాజరయ్యారు.


ప్రత్యేక వెబ్‌సైట్ ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్


ఢిల్లీలో కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను మర్యాద పూర్వకంగా కలుసుకున్న రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి

26న బడిపిల్లల అల్పాహార పథకం విస్తరణ

● ముఖ్యఅతిథిగా పంజాబ్ ముఖ్యమంత్రి

పెరంబూర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): అల్పాహార పథక విస్తరణ వేడుకలకు హాజరు కావాలంటూ పంజాబ్ ముఖ్యమంత్రిని కలిసిన డీఎంకే ఎంపీ విల్సన్ ఆహ్వానించారు. దేశంలోనే తొలిసారిగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉదయం అల్పాహారం అందించే పథకాన్ని మదురై ఆదిమూలం కార్పొరేషన్ ప్రాథమిక పాఠశాలలో 2022 సెప్టెంబరు 15న ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించారు. ఈ నేపథ్యంలో, రాష్ట్రవ్యాప్తంగా నగర ప్రాంతాల్లో ఉన్న ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న 3.05 లక్షల మంది విద్యార్థులకు అల్పాహారం పథకం విస్తరించనున్నట్లు సీఎం ప్రకటించారు. ఈ పథకాన్ని మైలాపూర్‌లోని సెయింట్ సూయప్పన్ ప్రాథమిక పాఠశాలలో సీఎం ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి పంజాబ్ రాష్ట్ర ముఖ్యమంత్రి భగవంత్ మాన్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. డీఎంకే ఎంపీ విల్సన్, పంజాబ్ సీఎంను కలిసి ఆహ్వానించారని పరిశ్రమల శాఖ మంత్రి టీఆర్బీ రాజా తన ఎక్స్ పేజీలో తెలియజేశారు.


పంజాబ్ ముఖ్యమంత్రికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న డీఎంకే ఎంపీ విల్సన్



వచ్చేవారం రాధాకృష్ణన్ పర్యటన

● ఎంపీలతో భేటీ

చెన్నై, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఎన్‌డీఏ తరపున ఉపరాష్ట్రపతి పదవికి పోటీ చేస్తున్న మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ వచ్చేవారం నగరానికి రానున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి చెందిన ఎన్‌డీఏ ఎంపీలతో భేటీ కానున్నారు. రాష్ట్రంలోని లోక్‌సభ సభ్యులంతా డీఎంకే కూటమికి చెందినవారే కావడంతో అన్నాడీఎంకే రాజ్యసభ ఎంపీలను మాత్రమే ఆయన కలుసుకుంటారని తెలుస్తోంది. రాధాకృష్ణన్ పర్యటన తేదీ ఇంకా ఖరారు కాలేదని బీజేపీ రాష్ట్ర నాయకులు చెబుతున్నారు. కాగా ఇండియా కూటమి తరపున పోటీ చేయనున్న జస్టిస్ సుదర్శనరెడ్డి ఆదివారం నగరానికి వచ్చి డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్, డీఎంకే మిత్రపక్షాలకు చెందిన నేతలతో భేటీ కానున్నారు. ఈ నేపథ్యంలో సీపీ రాధాకృష్ణన్ కూడా వచ్చేవారం పర్యటించి, అన్నాడీఎంకే ఎంపీలను కలుసుకుని సెప్టెంబర్ 9న జరుగనున్న ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో తనకు మద్దతు కోరనున్నారు. ప్రస్తుతం ఆయన ఢిల్లీలో ఎన్డీయే మిత్రపక్షాలకు చెందిన ఎంపీలను కలుసుకుంటూ బిజీగా ఉంటున్నారని బీజేపీ రాష్ట్ర నాయకులు తెలిపారు.



అప్పుల ఊబిలోకి రాష్ట్రం

● తిరువెరుంబూర్ సభలో డీఎంకేపై ఈపీఎస్ ధ్వజం

ప్యారీస్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): విపరీతంగా అప్పులు చేసి, వాటిని తీర్చే మార్గం తెలియక డీఎంకే ప్రభుత్వం సతమతమవుతోందని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి విమర్శించారు. వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకుని రాష్ట్రంలో ఆయన చేపట్టిన ప్రచార యాత్ర శనివారం తిరుచ్చి జిల్లాలోని తిరువెరుంబూర్ చేరుకుంది. ఇక్కడ రోడ్ షోలో ఈపీఎస్ మాట్లాడుతూ.. గత అన్నాడీఎంకే ప్రభుత్వం ఉన్న ఐదేళ్ల అమలుపరిచిన సంక్షేమ, అభివృద్ధి పథకాలకు రూ.5.15 వేల కోట్లు రుణం పొందిందని, అయితే 2021లో అధికారంలోకి వచ్చిన డీఎంకే ప్రభుత్వం ఈ నాలుగేళ్లలో రూ.10.35 వేల కోట్లు అప్పు చేసి, తిరిగి చెల్లించలేక సతమతమవుతోందని, మరోవైపు పన్నుల రూపంలో ప్రజలపై మరింత ఆర్థిక భారం మోపుతున్నారని ఆరోపించారు. గుంతలమయమైన రోడ్లకు మరమ్మతులు చేపట్టకపోవడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. జల్లికట్టుకు పేరుగాంచిన తిరువెరుంబూర్ ప్రాంతంలో అభివృద్ధి అంతంతమాత్రంగానే ఉందని, డెల్టా జిల్లాల్లో రైతులకు న్యాయం జరగడం లేదని, అన్ని సమస్యలు అన్నాడీఎంకే అధికారంలోకి వచ్చిన తర్వాత తీరుస్తామని ఈపీఎస్ రాష్ట్ర ప్రజలకు హామీ ఇచ్చారు.

1 నుంచి నాలుగో విడత ప్రచారం...

సెప్టెంబరు 1 నుంచి 13వ తేది వరకు ఈపీఎస్ నాలుగో విడత ప్రచార కార్యక్రమాలను అన్నాడీఎంకే కార్యాలయం విడుదల చేసింది. మదురై, తేని, దిండుగల్, కోయంబత్తూర్, తిరుప్పూర్ జిల్లాల్లోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈపీఎస్ పర్యటించి ప్రచారంలో పాల్గొంటారని ఆ కార్యాలయం తెలిపింది.


తిరువెరుంబూరు రోడ్‌షోలో ప్రసంగిస్తున్న అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి

వర్షంనీటిలో విద్యుత్ వైరు తగిలి పారిశుధ్య కార్మికురాలి మృతి



● కుటుంబానికి రూ.20లక్షల సాయం

చెన్నై, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): చోళింగనల్లూరు సమీపం కన్నగినగర్ వద్ద శనివారం ఉదయం వాననీటిలో తెగిపడి ఉన్న విద్యుత్ వైరు తగిలి వరలక్ష్మి (30) అనే పారిశుధ్య కార్మికురాలు మృతి చెందింది. వేకువజాము రహదారిని శుభ్రం చేయడానికి వెళ్ళిన వరలక్ష్మి రోడ్డు పక్కనే విద్యుత్ జంక్షన్ బాక్స్ నుండి వేలాడుతున్న వైరుపై చూసుకోకుండా కాలు వేశారు. దీంతో ఆమె కరెంట్‌షాక్‌కు గురై కుప్పకూలిపడ్డారు. ఆ సమయంలో అక్కడే ఉన్న కొందరు ఆమెను కాపాడేందుకు చేసిన ప్రయత్నించినప్పటికీ ఆమె ప్రాణాలు కోల్పోయింది. ఈ విషయం తెలియగానే రాష్ట్ర ప్రభుత్వం వరలక్ష్మి కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థికసాయం అందించనున్నట్లు ప్రకటించింది. ఆ మేరకు రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సుబ్రమణ్యం వరలక్ష్మి ఇంటికి వెళ్ళి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆ తర్వాత ప్రభుత్వం తరఫున రూ.10లక్షలు, ఆ ప్రాంతంలో పారిశుధ్య పనులను నిర్వహిస్తున్న సంస్థ తరఫున రూ.10లక్షలు చొప్పున రెండు చెక్కులను వరలక్ష్మి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సుబ్రమణ్యం మీడియాతో మాట్లాడుతూ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న వరలక్ష్మి భర్త రవి వైద్యానికి అయ్యే ఖర్చు ప్రభుత్వమే భరిస్తుందని, వెంటనే ఆయనకు ప్రభుత్వం తరఫున మెరుగైన చికిత్స అందిస్తామన్నారు. వరలక్ష్మి ఇద్దరు పిల్లల చదువుల ఖర్చు కూడా ప్రభుత్వం భరిస్తుందని తెలిపారు. ఇదిలా ఉండగా బీజేపీ నాయకురాలు డాక్టర్ తమిళిసై , నామ్ తమిళర్ కట్చి నేత సీమాన్ వరలక్ష్మి కుటుంబసభ్యులను పరామర్శించి, భౌతికకాయంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు.


పారిశుధ్య కార్మికురాలి కుటుంబానికి చెక్కు అందజేస్తున్న మంత్రి సుబ్రమణ్యం - (ఇన్‌సెట్‌లో) వరలక్ష్మి (ఫైల్‌ఫొటో)

సమాచార దృశ్యిని

ఎల్లమ్మ హుండీ ఆదాయం రూ.15.77 లక్షలు

వేలూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): వెట్టువానమ్ ఎల్లమ్మ హుండీ ఆదాయం రూ.15.77లక్షలు వచ్చిన ట్టు అధికారులు తెలిపారు. ఆడి నెల సందర్భంగా ఆలయానికి వచ్చిన భక్తులు హుండీల్లో చెల్లించిన కానుకల లెక్కింపు శుక్రవారం ఆలయ ప్రాంగణంలో జరిగింది. మొత్తం రూ.15,77,300 నగదు, 42 గ్రాముల బంగారం, 251 గ్రాముల వెండి హుండీల ద్వారా వచ్చినట్టు ఆలయ అధికారులు తెలిపారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

తాంబరం: తిరువేంగడమ్ నగర్, మేలండై నగర్, సౌత్ వీధి, పూర్ణతిలగం వీధి, కల్యాణ్ నగర్, వైగై నగర్.

ముడిచూర్: రంగా నగర్, అన్నై ఇంద్ర నగర్, సారంగ అవెన్యూ, కెప్టెన్ శశికుమార్ నగర్, తిరువళ్లువర్ నగర్, కామరాజ్ హైరోడ్డు, పేట్టై వీధి, కన్నగి వీధి, మేట్టు వీధి, పంచాయతీ బోర్డు రోడ్డు, చక్ర అవెన్యూ.


పెరుంగళత్తూర్: భారతి అవెన్యూ, చిత్ర అవెన్యూ, బాలాజీ నగర్, కురింజి నగర్, కాకాపుజాందార్ నగర్, కామరాజర్ హైరోడ్డు, శఠగోపన్ నగర్.

పోరూర్: లక్ష్మీ అవెన్యూ, ముగాలిఅక్కం మెయిన్ రోడ్డు, రామచంద్ర నగర్, బాలాజీ నగర్, అన్నై వేలాంకన్ని నగర్, కుమారి నగర్, శివాజీ నగర్, ఓంశక్తి నగర్, ఎంఆర్‌కే నగర్, ఎల్ అండ్ టీ నగర్, మాతా నగర్.

రాగుల ఉత్పత్తిలో అగ్రస్థానం

పెరంబూర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే రాగులు ఉత్పత్తిలో రాష్ట్రం ప్రథమ స్థానంలో ఉందని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు సచివాలయం శనివారం విడుదల చేసిన ప్రకటనలో.... ద్రవిడ మోడల్ పాలనలో రాగుల ఉత్పత్తిలో రాష్ట్రం అగ్రస్థానంలో నిలిచిందని, నాలుగేళ్లలో 457.08 లక్షల మెట్రిక్ టన్నుల ఆహార ధాన్యాలు రాష్ట్రం ఉత్పత్తి చేసిందని తెలిపింది. అలాగే, మొక్కజొన్న, చెరకు ఉత్పత్తి సామర్థ్యంలో రెండవ స్థానంలో నిలిచినట్లు ప్రభుత్వం తెలియజేసింది.

పులిగుండులో షూటింగ్ సందడి


పులిగుండు వద్ద వేసిన సెట్

పెనుమూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా పెనుమూరు మండలంలో ప్రముఖ పర్యాటక కేంద్రమైన పులిగుండు వద్ద శనివారం సందడి నెలకొంది. తమిళనాడు చెన్నైకి చెందిన సినిమా బృందం పులిగుండు వద్ద నెట్‌ఫ్లిక్స్ సిరీస్ కోసం సినిమా సెట్లు వేసి షూటింగ్ నిర్వహించారు. పులిగుండు మధ్యలో ఉన్న పేటుపై నుంచి కిందకు రోప్ ఏర్పాటుచేసి షూటింగ్ నిర్వహించడాన్ని చుట్టుపక్కల ప్రజలు చూడటానికి ఎగబడ్డారు. గతంలో కూడా పులిగుండు వద్ద అనేక భాషల్లో పలు సినిమాలు, సన్నివేశాలు తీసిన విషయం తెలిసిందే. ఇటీవల రాష్ట్ర టూరిజం శాఖ అధికారులు సర్వే చేసి 70 ఎకరాల్లో అభివృద్ధి చేయడానికి జిల్లా అధికారులు ప్రతిపాదనలు పంపారు.

ఇసుక లారీ సీజ్... ఇద్దరిపై కేసు నమోదు

గుడిపాల, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా నుంచి తమిళనాడుకు ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీని శనివారం సీజ్ చేసినట్లు ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ చిత్తూరు రూరల్ మండలం ఎన్ఆర్‌పేట ఇసుక రీచ్ నుంచి తమిళనాడుకు లారీ ద్వారా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న యజమాని శేఖర్, డ్రైవర్ శరవణను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పోలీసు కస్టడీకి అబూబకర్


అబూబక్కర్ సిద్దిక్

ప్యారీస్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సీనియర్ నేత అద్వానీ రథ యాత్రలో పైప్ బాంబ్ అమర్చిన కేసులో అరెస్టయిన అబూబక్కర్ సిద్దిక్‌ను ఆరు రోజులు పోలీసు కస్టడీకి అప్పగిస్తూ పూందమల్లి ప్రత్యేక న్యాయస్థానం ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్రంలో పలు బాంబు పేలుళ్ల కేసులు, మతఘర్షణలు, మతపరమైన హత్యలకు పథకం రూపొందించి ఉగ్రవాద చర్యలకు పాల్పడి 30 ఏళ్లుగా అజ్ఞాతంలోకి జారుకున్న నాగూర్ అబూబక్కర్ సిద్దిక్, తిరునల్వేలి మహ్మద్ అలీలను ప్రత్యేక పోలీసులు గత నెల ఆంధ్ర రాష్ట్రానికి వెళ్లి అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. వారిని విచారించగా.. వేలూరు బీజేపీ ప్రముఖుడు డా.అరవింద్ రెడ్డి హత్యకేసు, అద్వానీ రథయాత్ర సమయంలో పైప్ బాంబు అమర్చడం తదితర విధ్వంసకరమైన కేసుల్లో అబూబక్కర్ సిద్దిక్‌కు సంబంధాలున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో, 30 ఏళ్ల అనంతరం పట్టుబడిన అబూబకర్ సిద్దిఖ్ వద్ద విచారణ జరిపేందుకు ఉగ్రవాద నిరోధక విభాగం పోలీసులు తమ కస్టడీకి అప్పగించాలని కోరుతూ పూందమల్లిలోని ప్రత్యేక కోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై శుక్రవారం విచారణ జరిపిన న్యాయమూర్తి మలర్‌విళి... అబూబక్కర్ సిద్దిక్ ఆరు రోజులు పోలీసు కస్టడీకి అప్పగిస్తూ, ఈ నెల 28వ తేది మళ్లీ న్యాయస్థానంలో హాజరుపరచాలని ఉత్తర్వులు జారీచేశారు.

బాలికతో వ్యభిచారం..! సహాయ నటి సహా ముగ్గురి అరెస్టు

చెన్నై, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోయంబేడులోని ఓ లాడ్జిలో 15 యేళ్ల బాలికతో వ్యభిచారం చేయించిన ఓ నటి సహా ముగ్గురిని అరెస్టు చేశారు. ఆ లాడ్జిలో వ్యభిచారం జరుగుతుందనే సమాచారంతో సీఐ రాజలక్ష్మి నాయకత్వంలో పోలీసులు ఆకస్మిక తనిఖీలు జరిపారు. ఆ సందర్భంగా 15 యేళ్ల బాలికతో బలవంతంగా వ్యభిచారం చేయించడానికి ప్రయత్నిస్తున్న కేకే నగర్‌కు చెందిన అంజలి, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సహాయ నటి నాగమ్మ, నాగరాజ్ అనే వారిని అరెస్టు చేశారు. పోలీసులు ఆ బాలికను ప్రశ్నించగా ఆమె తండ్రి మృతి చెందాడని, తల్లి మరొకరిని వివాహం చేసుకుని విడిచిపెట్టి వెళ్లిందని తెలుసుకున్నారు. మూడేళ్లుగా అంజలి సంరక్షణలో ఉన్న బాలికను మాయమాటలు చెప్పి వ్యభిచారంలోకి నెట్టారని పోలీసుల విచారణలో వెల్లడైంది.

మాతో ఎవరూ సరితూగరు..!

● అమిత్ షాకు మంత్రి కేఎన్ నెహ్రూ చురక


మీడియాతో మాట్లాడుతున్న మంత్రి కేఎన్ నెహ్రూ

ప్యారీస్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): డీఎంకేతో సరితూగగల పార్టీ ఏదీ లేదని రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ మంత్రి కేఎన్ నెహ్రూ కేంద్ర మంత్రి అమిత్ షాను ఉద్దేశించి పేర్కొన్నారు. తిరునల్వేలిలో శుక్రవారం సాయంత్రం జరిగిన బీజేపీ బూత్ కమిటీల సమావేశంలో అవినీతిని ప్రోత్సహిస్తున్న డీఎంకే ప్రభుత్వాన్ని వేళ్లతో సహా పీకి పారేద్దామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో, తిరునల్వేలిలో జరిగిన కార్యక్రమంలో స్పీకర్ అప్పావుతో కలసి పాల్గొన్న మంత్రి కేఎన్ నెహ్రూ మాట్లాడుతూ... వేళ్లతో సహా పీకి పారేసేందుకు డీఎంకే చెట్టు కాదని, కోట్లాది మంది ప్రజల మద్దతుతో నాలుగేళ్లకు పైగా సుపరిపాలన అందిస్తుందన్నారు. 15 ఏళ్లుగా తమకు గిట్టని పార్టీల ప్రభుత్వాలను వేళ్లతో పీకేయడమే బీజేపీ పని అని, డీఎంకే గురించి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను పట్టించుకోబోమన్నారు. అన్నాడీఎంకే-బీజేపీ కూటమిలో ఇంకా స్పష్టత రాలేదని, ఇప్పటికి మూడు సార్లు రాష్ట్రానికి వచ్చిన అమిత్ షా ప్రతి సభలో, సంకీర్ణ ప్రభుత్వమేనని చెబుతున్నారే కానీ, అది ఏ పార్టీ నేతృత్వంలో ఉందో చెప్పకుండా దాటవేస్తున్నారని వ్యాఖ్యానించారు. ఎంజీఆర్‌లాగే సీఎం స్టాలిన్‌కు కూడా మహిళల ఆదరణ పెరుగుతోందని, అందువల్ల వచ్చే ఏడాది జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే మెజార్టీ స్థానాల్లో విజయం సాధించి అధికారం కాపాడుకుంటుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

7న ఓటు చోరీ వివరణపై మహానాడు

● టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై

ప్యారీస్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఓటు చోరీ గురించి ప్రజలను వివరించే మహానాడు సెప్టెంబరు 7న నిర్వహించనున్నట్లు తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) అధ్యక్షుడు సెల్వపెరుందగై ప్రకటించారు. ఆయన శనివారం నగరంలో మీడియాతో మాట్లాడుతూ... బీజేపీ ప్రభుత్వం ఓటు చోరీకి పాల్పడుతోందని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారని, ఈ వ్యవహారంలో ప్రతిపక్షాలు కూడా బీజేపీకి వ్యతిరేకంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. ఓటు హక్కు అనే ప్రజాస్వామ్యానికే బీజేపీ తూట్లు పొడిచిందని, ప్రజాదరణ పొందలేక అడ్డదారిలో ప్రభుత్వం ఏర్పాటుచేసే కుట్ర పన్నిందని ఆరోపించారు. ఓటు చోరీపై బీజేపీ వైఖరిని ఖండిస్తూ సెప్టెంబరు 7వ తేది కన్నియాకుమారిలో టీఎన్‌సీసీ తరఫున మహానాడు నిర్వహించనున్నట్లు, ఈ మహానాడుకు డీఎంకే, మిత్రపక్ష పార్టీల నేతలతో పాటు లక్ష మందికి పైగా కార్యకర్తలు పాల్గొంటారని సెల్వపెరుందగై తెలిపారు.

పీఎంకే నేత జీకే మణికి అస్వస్థత

● అపోలో ఆస్పత్రిలో చికిత్స


జీకే మణి

చెన్నై, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పాట్టాలి మక్కల్ కట్చి (పీఎంకే) గౌరవాధ్యక్షుడు జీకే మణి తీవ్ర అస్వస్థతకు గురై అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. శుక్రవారం రాత్రి ధర్మపురిలో ఓ శుభ కార్యక్రమానికి వెళ్లారు. ఆ సమయంలో ఉన్నట్టుండి గుండెలో, వెన్నెముక వద్ద నొప్పి రావడంతో అస్వస్థతకు గురయ్యారు. వెంటనే ఆ ప్రాంతంలో ఉన్న వైద్యుల వద్దకు జీకే మణిని పార్టీ నాయకులు తీసుకెళ్లి వైద్యపరీక్షలు చేయించారు. వారి సలహా మేరకు మెరుగైన చికిత్స కోసం కారులో శనివారం వేకువజాము చెన్నై వానగరంలోని అపోలో ఆసుపత్రిలో చేర్పించారు. ప్రస్తుతం వైద్యనిపుణులు ఆయనకు వైద్యపరీక్షలు నిర్వహించి చికిత్సఅందిస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


విద్యార్థులకు మొక్కలు అందిస్తున్న నిర్వాహకులు

వేలూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని పలువురు వక్తలు తెలిపారు. ఏపీజే అబ్దుల్ కలాం ట్రస్ట్ తరపున ఆర్కాడు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ఈశ్వరన్ పాల్గొని, విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేసి, పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు దేవి, ఉపాధ్యక్షులు పవళకొడిశరవణన్, ట్రస్ట్ అధ్యక్షుడు గోపి తదితరులు పాల్గొన్నారు.

చెస్ విజేతలకు బహుమతుల ప్రదానం


విజేతలతో నిర్వాహకులు

వేలూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): భారతి చెస్ అకాడమీ ఆధ్వర్యంలో పాఠశాల, కళాశాల స్థాయి చెస్ పోటీలు అడుక్కమ్‌పారైలోని వెంకటేశ్వర పాలిటెక్నిక్‌లో నిర్వహించారు. ఈ పోటీలను అకాడమీ చైర్మెన్ దినకరన్ ప్రారంభించారు. 9,11,13,16,25 ఏళ్ల ఇలా ఐదు విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో మొదటి స్థానంలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా ప్రకాష్, వసంతకుమారి, జ్యోతి వ్యవహరించారు.

ఎయిర్‌పోర్ట్‌లో రూ.95లక్షల విలువైన బంగారం స్వాధీనం

చెన్నై, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): చెన్నై అంతర్జాతీయ విమానాశ్రయంలో శుక్రవారం రాత్రి రూ.95లక్షల విలువైన బంగారం పట్టుబడింది. ఖతార్ రాజధాని దోహా నుండి వచ్చిన విమానం నుంచి దిగిన ప్రయాణికులను కస్టమ్స్ అధికారులు తనిఖీ చేశారు. నగరానికి చెందిన 35 యేళ్ల ప్రయాణికుడి ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండటంతో అతడి లగేజీ సోదా చేశారు. అతడి సూట్‌కేసులో కేజీ బరువున్న బంగారు కడ్డీలు బయటపడ్డాయి. వెంటనే ఆ బంగారాన్ని స్వాధీనం చేసుకుని అతడిని విమానాశ్రయ పోలీసులకు అప్పగించారు.

పోలీస్ స్టేషన్‌లో ఉన్న వారిపై దాడి

● చెన్నై సీఐ, ఎస్ఐలకు నెలరోజుల జైలు శిక్ష

ప్యారీస్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పోలీస్ స్టేషన్‌లో ఉన్న వారిపై దాడికి పాల్పడిన సీఐ, ఎస్ఐలకు తిరుచ్చి న్యాయస్థానం నెల రోజుల జైలుశిక్ష విధించింది. విరుగంబాక్కంకు చెందిన భవన నిర్మాణ కాంట్రాక్టర్ పసుపతి, అదే ప్రాంతానికి చెందిన రవి, వలర్మతి మధ్య పాతకక్షలున్నాయి. రవి, వలర్మతిలకు మద్దతుగా వ్యవహరించిన విరుగంబాక్కం పోలీస్ స్టేషన్ సీఐ జయరాజ్ 2016లో పసుపతి, ఆయన భార్య కళావతి, వారి కుమారులు తెన్నరసు, తమిళ్‌సెల్వన్, వివేక్ సహా ఆరుగురిపై కేసు నమోదుచేశారు. ఈ కేసులో మద్రాసు హైకోర్టును ఆశ్రయించిన పసుపతి బెయిలు పొంది, కోర్టు ఉత్తర్వుల మేరకు తిరుచ్చిలో కుటుంబంతో రెండు నెలలు గడిపారు. ఈ నేపథ్యంలో, పసుపతి, కుటుంబసభ్యులను కంటోన్మెంట్ పోలీస్ స్టేషన్‌లో సంతకం చేసేందుకు వెళ్లిన సమయంలో విరుగంబాక్కం సీఐ జయరాజ్, ఆయన జీప్ డ్రైవర్ కన్నన్, ఎస్ఐ విజయపాండియన్ వారిపై దురుసుగా ప్రవర్తించి దాడిచేసినట్లు సమాచారం. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన బాధితులు తిరుచ్చి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందారు. పోలీసులు జరిపిన దాడి గురించి పసుపతి తరఫున తిరుచ్చి కోర్టులో పిటిషన్ దాఖలైంది. శుక్రవారం విచారణ జరిపిన మేజిస్ట్రేట్ సుబ్రమణియన్... ఆరోపణలు ఎదుర్కొంటున్న సీఐ జయరాజ్, ఎస్ఐ విజయపాండియన్, జీప్ డ్రైవర్ కన్నన్‌లకు తలా నెల రోజుల జైలుశిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు.

శ్రీరాముడి వేషధారణలో పోస్టర్లు

● పార్టీ శ్రేణులపై నయినార్ ఆగ్రహం


తిరునల్వేలి గోడలపై అతికించిన శ్రీరాముడి వేషధారణలో ఉన్న నయినార్ నాగేంద్రన్ పోస్టర్లు

చెన్నై, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): హిందువుల ఆరాధ్యదైవం శ్రీరామచంద్రమూర్తితో తనను పోల్చవద్దంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ పార్టీ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రి అమిత్‌షా తిరునల్వేలి పర్యటన సందర్భంగా శ్రీరాముడి వేషధారణతో తన ఫొటోలున్న పోస్టర్లను అతికించడమే కాకుండా ఆ రూపంతో ఉన్న జెండాలు కూడా కార్యకర్తలు ఎగురవేయడంపై తాను తీవ్ర ఆవేదన చెందానని ఓ ప్రకటనలో తెలిపారు. దైవ శక్తిని మానవ శక్తితో పోల్చకూడదని, అవతారపురుషుడితో తనను పోల్చేలా ఇలాంటి పోస్టర్లు వేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. ఇకపై తనను దేవుళ్లతో పోల్చకూడదని, తనను దేవుడి రూపాలలో పోస్టర్లు ముద్రించకూడదని ఆయన పార్టీ శ్రేణులకు హెచ్చరించారు.

మద్రాస్ విశ్వవిద్యాలయంలో 28 నుంచి అంతర్జాతీయ సాహితీ సదస్సు

● రెండు రోజుల పాటు 'భువనచంద్ర సాహితీ సాగరం - సృజనాత్మక హరివిల్లు'

చెన్నై, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని మద్రాస్ విశ్వవిద్యాలయం తెలుగుశాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ సదస్సు జరుగనుంది. 'భువనచంద్ర సాహితీ సాగరం - సృజనాత్మకత హరివిల్లు' పేరుతో ఈ నెల 28న ప్రారంభం కానున్న ఈ సదస్సు రెండు రోజుల పాటు జరుగనుంది. గురువారం ఉదయం 10 గంటలకు మెరీనా ఆవరణలో జరుగనున్న సదస్సు ప్రారంభోత్సవానికి డాక్టర్ పాండురంగం కాళియప్ప ఆహ్వానం పలుకనుండగా, ఎస్పీ వసంతలక్ష్మి ప్రార్థన చేయనున్నారు. తెలుగుశాఖాధిపతి ఆచార్య విస్తాలి శంకరరావు అధ్యక్షత వహించనున్న ఈ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా ప్రముఖ సినీ సంగీత దర్శకులు విద్యాసాగర్ హాజరై ప్రత్యేక సంచికను ఆవిష్కరించనున్నారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా ప్రముఖ సినీ నటి ప్రభా రమేష్, గౌరవ అతిథిగా ప్రముఖ సినీ గేయరచయిత డాక్టర్ వనమాలి, ప్రత్యేక అతిథిగా వేదవిజ్ఞాన వేదిక అధ్యక్షులు జేకే రెడ్డి, ఆత్మీయ అతిథులుగా అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక భవన నిర్వాహక కమిటీ సంయుక్త కార్యదర్శి పూరా శశికళ, ఆఫ్రికాకు చెందిన ఆచార్య శ్రీదేవి శ్రీకాంత్ హాజరు కానున్నారు. అనంతరం ప్రముఖ సినీ గేయరచయిత భువనచంద్ర తన దృష్టి కోణాన్ని ఆవిష్కరించనుండగా, అనకాపల్లికి చెందిన కవి, విమర్శకులు డాక్టర్ తలతోటి పృథ్వీరాజ్ కీలకోపన్యాసం చేయనున్నారు. కార్యక్రమంలో భాగంగా భువనచంద్ర 'విస్తాలి' పేరుతో రూపొందించిన యూట్యూబ్ ఛానల్ లోగో ఆవిష్కరించనున్నారు. అనంతరం తొలిరోజు మూడు సమావేశాలు, రెండవరోజు మరో ఆరు సమావేశాలు జరుగనుండగా పలువురు సాహితీవేత్తలు, పరిశోధకులు భువనచంద్ర రచనలపై పత్రసమర్పణ చేయనున్నారు. శుక్రవారం మధ్యాహ్నం సమాపనోత్సవం జరుగనుంది. ఆచార్య విస్తాలి అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో జరీనా షేక్, సీనియర్ నిర్మాత కాట్రగడ్డ ప్రసాద్, తానా పూర్వాధ్యక్షులు డాక్టర్ ప్రసాద్ తోటకూర, ప్రముఖ ఆర్కిటెక్ట్ ఎం.వెంకట్ ఆదిశేషయ్య, ఆంధ్ర కళాస్రవంతి అధ్యక్షులు జేఎం నాయుడు, ఆప్కా ట్రస్ట్ కార్యదర్శి వి.విజయేంద్రరావు, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ప్రభల జానకి హాజరుకానున్నారు. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని ఆచార్య విస్తాలి విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

29 నుంచి బీసెంట్ నగర్ వేలాంకన్ని చర్చి వార్షికోత్సవాలు


మీడియాతో మాట్లాడుతున్న ఫాదర్ అరుళప్ప తదితరులు

ప్యారీస్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక బీసెంట్ నగర్‌లో ప్రపంచ ప్రసిద్ధిచెందిన సెయింట్ వేలాంకన్ని మేరీ మాత ఆలయ 53వ వార్షికోత్సవాలు ఈ నెల 29న పతాకావిష్కరణతో ప్రారంభమవుతాయని చర్చి ఫాదర్ అరుళప్ప పేర్కొన్నారు. శనివారం సాయంత్రం చర్చి ప్రాంగణంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో నగరంలోని పలు క్యాథలిక్ చర్చిల ఫాదర్లు, బిషప్‌లతో కలిసి ఫాదర్ అరుళప్ప పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ నెల 29వ తేది సాయంత్రం 5.45 గంటలకు పతాకావిష్కరణ కార్యక్రమంలో క్యాథలిక్ బిషప్‌లు పాల్గొంటారని తెలిపారు. సెప్టెంబరు 8వ తేది వరకు జరుగనున్న ఉత్సవాల్లో పాల్గొనే భక్తుల సౌకర్యార్థం చెన్నై మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ ప్రత్యేక సిటీ బస్సులు నగరం, శివారు ప్రాంతాల నుంచి బీసెంట్ నగర్‌కు నడిపేందుకు ముందుకు వచ్చిందన్నారు. వార్షికోత్సవాల్లో ప్రధానంగా సెప్టెంబరు 7వ తేది సాయంత్రం 5 గంటలకు చెన్నై బిషప్ జార్జి అంతోనిస్వామి నేతృత్వంలో సామూహిక ప్రార్థనల అనంతరం ఆరోగ్యమాత రథోత్సవం ప్రారంభమవుతుందని, మరుసటిరోజు 8వ తేది అమ్మవారి జయంతి సందర్భంగా ప్రత్యేక ప్రార్థనా కార్యక్రమాలు, పట్టాభిషేకం జరుగుతాయని తెలిపారు. ఉత్సవ రోజుల్లో 400 మందికి పైగా స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారని అరుళప్ప తెలిపారు.

కాలువ నిర్మాణపనులు సకాలంలో పూర్తిచేయండి


పాలారు కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారం పరిశీలిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చేపట్టిన కాలువల నిర్మాణ పనులు వర్షాకాలానికి ముందుగానే పూర్తిచేసేలా పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పాలారు నదిలో వ్యర్థపు నీరు కలవకుండా చేపట్టాల్సిన చర్యలను శనివారం జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ వెంట జిల్లా కాలుష్య మండలి ఇంజనీర్ వెంకటేశన్, నీటిపారుదల శాఖ ఇంజనీర్ వెంకటేశన్, కార్పొరేషన్ సంక్షేమ అధికారి ప్రతాప్‌కుమార్, తాగునీటి బోర్డు ఇంజనీర్ తులసి రామన్ తదితరులున్నారు.

అప్పు తీర్చినా పత్రాలివ్వడం లేదు...!

● హైకోర్టును ఆశ్రయించిన వృద్ధురాలు

ప్యారీస్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): అప్పు తీర్చినా కుదువ పెట్టిన భూమి పత్రాలు ఇవ్వకపోవడంతో ఓ వృద్ధురాలు హైకోర్టును ఆశ్రయించింది. నగరానికి చెందిన మాజీ ప్రభుత్వ ఉద్యోగి కుళందవేలు భార్య ధనవతి ఎడ్వర్డ్ (79) గత 1982వ సంవత్సరంలో ఇంటి నిర్మాణం కోసం తన భర్త ప్రభుత్వ ఉద్యోగిగా ఉన్న సమయంలో ప్రభుత్వం నుంచి రూ.1.05 లక్షలు రుణం తీసుకుని అరుంబాక్కంలో ఇల్లు నిర్మించారు. రుణం పొందేందుకు ధనవతి ఎడ్వర్డ్ భూమి పత్రాలు పెట్టింది. ఈ క్రమంలో, కుళందవేలు 1990లో పదవీ విరమణ పొంది ఆస్ట్రేలియా వెళ్లి అక్కడే ఉండిపోయాడు. ఆస్ట్రేలియా వెళ్లే ముందు కుళందవేలు తన రుణాలకు అన్నింటినీ తీర్చి వెళ్లినట్లు సమాచారం. అంతకు ముందే ఆయన తమ ఆస్తులకు సంబంధించిన హక్కులను భార్య ధనవతి పేరుమీద వీలునామా రాశారు. అప్పటి నుండి తాకట్టుపెట్టిన ఇంటి పత్రాల కోసం చెన్నై జిలా కలెక్టర్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది. ఈ క్రమంలో, తనకు పత్రాలు అందించాలని కోరుతూ మద్రాసు హైకోర్టులో ధనవతి పిటిషన్ వేసింది. ఈ పిటిషన్ శుక్రవారం విచారించిన న్యాయమూర్తి ఆనంద్ వెంకటేష్.. 79 ఏళ్ల ప్రాయంలో ఉన్న వృద్ధురాలి కోరిక నెరవేర్చాలని సూచించారు. ఆ సమయంలో ఆమె కొన్ని పత్రాలు సమర్పించాల్సి ఉందని, వాటిని అందజేస్తే పత్రాలు అందిస్తామని కలెక్టర్ తరపు న్యాయవాది తెలిపారు. ఆ వివరణ పరిగణలోకి తీసుకున్న న్యాయమూర్తి, వృద్ధురాలికి ఇబ్బంది కలిగించకుండా పత్రాలు అందజేయాలని ఉత్తర్వులు జారీచేశారు.

స్పా లో వ్యభిచారం.. మహిళ అరెస్ట్

పెరంబూర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక కేకే నగర్ సమీపంలోని స్పా సెలూన్‌లో వ్యభిచారం సాగిస్తున్న మహిళను పోలీసులు అరెస్ట్ చేశారు. సాలిగ్రామం నెహ్రూ వీధిలోని స్పా సెంటర్‌లో వ్యభిచారం జరుగుతోందని కేకే నగర్ పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు శుక్రవారం మధ్యాహ్నం స్పా సెంటర్‌లో తనిఖీలు చేపట్టి, వ్యభిచారం జరుగుతున్నట్లు తెలుసుకున్నారు. ఈ వ్యవహారంలో కెరుగంబాక్కంకు చెంది ఓ మహిళ(27)ను అరెస్ట్ చేసిన పోలీసులు, ఇద్దరు మహిళలను రక్షించి ప్రభుత్వ హోంకు తరలించినట్లు నగర పోలీసు శాఖ ఓ ప్రకటనలో తెలిపింది.

చెన్నై విమానాశ్రయంలో జీపీఎస్ పరికరం స్వాధీనం

ప్యారీస్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): నగరం నుంచి ఇండిగో విమానంలో సేలం వెళ్లాల్సిన యువకుడి నుంచి జీపీఎస్ పరికరాన్ని స్వాధీనం చేసుకున్నారు. స్థానిక త్రిశూలం విమానాశ్రయం నుంచి శుక్రవారం సాయంత్రం సేలం వెళ్లాల్సిన ప్రయాణికుల లగేజీని కస్టమ్స్ అధికారులు తనిఖీచేశారు. ఆ సమయంలో సేలంకు చెందిన సురేష్ (35) అనే ప్రయాణికుడి బ్యాగులో పరిశోధనలకు ఉపయోగించే జీపీఎస్ పరికరాన్ని గుర్తించి, విమానంలో తీసుకెళ్లేందుకు అనుమతించలేదు. దీంతో, సురేష్ ప్రయాణం రద్దు చేసిన అధికారులు, జీపీఎస్ పరికరం స్వాధీనం చేసుకుని విచారణ నిమిత్తం విమానాశ్రయ పోలీసులకు అప్పగించారు.

మత్తుబిళ్లల స్వాధీనం

● యువకుడి అరెస్టు

ప్యారీస్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక వలసరవాక్కంలో కళాశాల విద్యార్థులు, భవన నిర్మాణ కార్మికులకు మత్తుబిళ్లలు విక్రయించిన యువకుడిని అరెస్ట్ చేసిన పోలీసులు, అతని నుంచి 1,700 మత్తుబిళ్లలు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. వలసరవాక్కం-ఆర్కాడు రోడ్డులో వాహనాల తనిఖీ చేసిన పోలీసులు రోడ్డు పక్కన నిలబడిన ఓ యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. అతని బ్యాగు తనిఖీచేసి మత్తుబిళ్లలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ మాత్రలు ఎక్కడి నుంచి తెస్తున్నారు? ఎవరెవరికి విక్రయిస్తున్నారు? అనే కోణాల్లో అతనిని విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చెరువు ప్రహరీని ఢీకొన్న బస్సు

ప్రయాణికులకు తప్పిన ముప్పు


చెరువు ప్రహరీగోడపై వేలాడుతున్న బస్సు

చెన్నై, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా మీంజూరు నుండి పొన్నేరి వెళ్తున్న విల్లుపురం డిపో బస్సు అదుపు తప్పి చెరువు ప్రహరీగోడను ఢీకొంది. ఆ సమయంలో ఆరుగురు ప్రయాణికులు మాత్రమే బస్సులో ఉండటంతో డ్రైవర్, కండెక్టర్, ప్రయాణికులు చాకచక్యంగా వ్యవహరించి బస్సు వెనుక నుంచి కిందకు దూకి ప్రాణాలను కాపాడు కున్నారు. పొన్నేరి నుండి ఆలాడు, రెడ్డిపాళయం, తత్తైమంజి, కాటూరు మీదుగా మీంజూరుకు విల్లుపురం డిపో కు చెందిన బస్సు నడుపుతున్నారు. శనివారం వేకువజాము మీంజూరు వెళ్ళిన ఆ బస్సు పొన్నేరికి తిరిగి వస్తుండగా తత్తైమంజి వద్ద అదుపు తప్పి రహదారి పక్కనే ఉన్న చెరువు ప్రహరీ గొడను ఢీకొని ఆగింది. బస్ డ్రైవర్, కండెక్టర్ సహా ఎనిమిది మంది బస్సు వెనుకవైపు వెళ్ళి కిందకు దూకి ప్రాణగండం నుండి తప్పించుకున్నారు. సమాచారం అందాగానే రవాణా సంస్థ అధికారులు, సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకుని బస్సును తొలగించే పనులు చేపట్టారు.

పిడుగుపాటుకు అక్కాచెల్లెళ్ల మృతి

పెరంబూర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పిడుగుపాటుకు అక్కాచెల్లెలు మృతిచెందిన ఘటన రామనాథపురం జిల్లాలో చోటుచేసుకుంది. వాళవందాల్‌పురం ప్రాంతానికి చెందిన ఆస్పియా భాను (13), చెల్లెలు సబికా భాను (10)తో కలసి శనివారం మధ్యాహ్నం ఇంటి సమీపంలో వేపాకులు సేకరిస్తోంది. ఆ సమయంలో ఉరుములతో, పిడుగులతో కూడిన వర్షం కురిసి సమీపంలో పిడుగు పడడంతో ఇద్దరూ స్పృహతప్పి పడిపోయారు. చుట్టుపక్కల వారు వారిని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో వారు మృతి చెందారు. స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

మగ ఏనుగుపై ఆడ ఏనుగు దాడి

● కత్తితో దాడిచేసిన మావటి సస్పెన్షన్

పెరంబూర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఆడ ఏనుగు కాలిపై కత్తితో కొట్టిన మావటిని అధికారులు సస్పెండ్ చేశారు. నీలగిరి జిల్లా ముదుమలై ఏనుగుల శిబిరంలో సుమంగళి అనే ఆడ ఏనుగు, అక్కడే ఉన్న శంకర్ అనే మగ ఏనుగుపై దాడిచేసింది. ఈ ఘటనలో శంకర్ కిందపడి పోవడాన్ని గమనించిన దాని మావటి విక్కీ ఆడ ఏనుగును బెత్తంతో దాడి బెదిరించాడు. అయినా లెక్కచేయకుండా సుమంగళి మగ ఏనుగు విక్కీపై దాడికి యత్నించినట్లు సమాచారం. దీంతో, విక్కీ ఆడ ఏనుగు కాలిపై కత్తితో కొట్టాడు. ఈ ఘటనపై విచారించిన అధికారులు, విక్కీని సస్పెండ్ చేశారు.

విద్యార్థినిపై లైంగిక వేధింపులు

● ప్రిన్సిపాల్ అరెస్ట్

పెరంబూర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి జిల్లాలో 9వ తరగతి విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడిన ప్రిన్సిపాల్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. జిల్లాలోని ఓ ప్రైవేటు పాఠశాల ప్రిన్సిపాల్‌కు వివాహమై ఇద్దరు కుమార్తెలున్నారు. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు సమాచారం. ఆ బాలిక తల్లిదండ్రులకు చెప్పడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టిన పోలీసులు, ప్రిన్సిపాల్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసి, అరెస్ట్ చేసి జైలుకు తరలించారు.


మంత్రి దురైమురుగన్‌ను శనివారం మర్యాదపూర్వకంగా కలుసుకున్న వేలూరు కార్పొరేషన్ మండలం-1లో కొత్తగా నియమితులైన హెల్త్ ఇన్స్‌పెక్టర్లు, ఆరోగ్య శాఖ అధికారి శివకుమార్

అపురూప వారసత్వ సంపద

అబ్బురపరిచే శిల్పకళ



స్వర్గవిలాసం కుడ్యాలపై వీరుడి శిల్పం



ప్యాలెస్ తూర్పు దిశ ప్రధాన ద్వారం

భారతదేశంలో ప్రాచీన రాజభవంతులెన్నో కాలగర్భంలో కలిసిపోయాయి. ప్రస్తుతం మదురైలోని తిరుమల నాయకర్ ప్యాలెస్ ప్రాచీన శిల్పకళలను ఎలుగెత్తి చాటుతూ అత్యంత అందమైన రాజభవనాల్లో ఒకటిగా పరిగణించబడుతోంది. పూర్వం విశాలమైన కళాత్మకమైన శిల్పాలతో నిర్మాణాలతో వెలుగొందిన ఈ ప్యాలెస్‌లో సగభాగం మాత్రమే మిగిలి ఉంది. ఇంతకీ ఈ ప్యాలెస్ పరిస్థితికి కారణం ఏమిటి? ఈ భవనాన్ని ఎవరు కూలగొట్టారు?..!

- టి.నగర్, ఆంధ్రజ్యోతి



ప్యాలెస్ ముఖమండపం

● తిరుమల నాయకర్ ప్యాలెస్‌లో రహస్యాలెన్నో..! ● సగం శిథిలమైనా తగ్గని పర్యాటకుల సందడి

క్రీ.శ 1623 నుండి క్రీ.శ 1659 వరకు నాయకర్ల రాజ్యాన్ని పరిపాలించిన చక్రవర్తి తిరుమల నాయకర్ మదురైలో తన కోసం అందమైన రాజభవనాన్ని నిర్మించారు. మదురైని పరిపాలించిన నాయకరాజుల్లో అత్యంత శక్తివంతమైన ధీరుడిగా పేరొందిన తిరుమల నాయకర్ క్రీ.శ. 1623లో నాయక రాజవంశంలో ఏడో రాజుగా సింహాసనాన్ని అధిష్ఠించాడు. అప్పటి నుండి పన్నెండేళ్లపాటు తిరుచిరాపల్లి ఆ రాజ్యానికి రాజధానిగా ఉండేది. తర్వాత క్రీ.శ. 1634లో తిరుమలనాయకర్ తన రాజధానిని మదురైకి మార్చినట్లు చరిత్రకారులు చెబుతున్నారు. రాజధానిని మదురైకి మార్చిన తర్వాత తిరుమల నాయకర్ ఆ నగరంలో తనకోసం ఓ రాజ భవనాన్ని నిర్మించాలని సంకల్పించారు. ఆ రాజ భవనంలో ఎక్కువ భాగం క్రీ.శ. 1636లోనే పూర్తయ్యింది. ఈ ప్యాలెస్ నిర్మాణ సమయంలో మదురై నగరం చుట్టూ భారీ ప్రహరీలతో పెద్ద కోట ఉండేది. ఆ కోటకు ఆగ్నేయంగా ఈ ప్యాలెస్ నిర్మించారు.. ఈ ప్యాలెస్ విస్తీర్ణం సుమారు ఒక చదరపు మైలు వరకు ఉండవచ్చని చారిత్రక పరిశోధకుడు డాక్టర్ టి. దేవకుంజరి తన 'మదురై త్రూ ది ఏజెస్' పుస్తకంలో పేర్కొన్నారు. ఈ ప్యాలెస్‌లో 'స్వర్గ విలాసం', 'రంగ విలాసం' అంటూ రెండు ప్రాంతాలుండేవి. తిరుమల నాయకర్ స్వర్గవిలాసంలోను, అతని తమ్ముడు ముత్యాలు నాయకర్ రంగవిలాసంలో ఉండేవారు. ఈ రెండు ప్రాంతాలతో పాటు సంగీత కార్యక్రమాలు నిర్వహించే ప్రదేశం, పూజాస్థలం, సింహాసనం గది, రంగస్థల వేదిక, పూల తోటలు, రాజమహల్‌లో పని చేసే సిబ్బంది నివాసాలుండేవి. ఈ ప్యాలెస్ ప్రధాన ప్రవేశ ద్వారం ప్రస్తుతం తూర్పు వైపుంది. ప్యాలెస్ నిర్మించినప్పుడు ప్రధాన ప్రవేశద్వారం ఉత్తరం వైపుండేది. ప్రస్తుత ప్రవేశ ద్వారం 19వ శతాబ్దంలో నిర్మించారు. ప్రస్తుత ప్రవేశద్వారం నుంచి లోపలకు ప్రవేశించగానే పెద్ద ప్రాంగణం, దానికి మూడు వైపులా భారీ స్తంభాలతో విశాలమైన వరండా కనిపిస్తాయి. దానిని దాటి వెళ్తే రెండు అశ్వాలతో కూడిన మెట్లదారి కనిపిస్తుంది. ఆ మెట్లపైకి ఎక్కితే రాజభవనంలో అతి ముఖ్యమైన భాగాన్ని చేరుకోవచ్చు. భారీ స్తంభాలు, అందమైన శిల్పాలతో కూడిన ఈ ప్రాంతాన్నే 'స్వర్గ విలాసం' అని పిలుస్తారు. మధ్యలో ఉన్న రాతి వేదికపై దంతాలతో నిర్మితమైన మండపం ఉంది. అక్కడే వజ్రాలు, రత్నాలు, ముత్యాలతో పొదిగిన సింహాసనం కూడా ఉండేదని చరిత్రకారులు చెబుతారు.

ఈ ప్యాలెస్‌కు వాయువ్యంగా చాలా అందమైన విశాలమైన హాలు ఉంది. దీనిని 'నాడగ సాలై' (రంగస్థల రహదారి) అని పిలుస్తారు. తిరుమలై నాయకర్ తన సతీమణులతో సాయం సమయాల్లో ఆశీనులై కాగడాల వెలుతురులో నాటకాలు, కళా ప్రదర్శనలను తిలకించేవారని, దేవకుంజరి తన గ్రంథంలో పేర్కొన్నారు. ప్యాలెస్‌కు ఉత్తరాన కొన్ని మీటర్ల దూరంలో ఓ సందులో 10 పెద్ద స్తంభాలున్నాయి. అవి ప్యాలెస్‌లో భాగంగా ఉండేవి. ఈ ప్రాంతమే 'రంగవిలాసం' అని పిలువబడే ప్రదేశం.. ఈ ప్యాలెస్‌కు ప్రధాన ద్వారం 10 స్తంభాలకు తూర్పు వైపున ఉంది. అయితే ఈ 10 స్తంభాల ఎత్తు చూపరులకు వింత గొలుపుతుందని, ఆ ప్రాంతం గజరాజులను కట్టి ఉంచే గజశాలగా ఉండొచ్చునని చెబుతారు. ఈ ప్యాలెస్‌లో అధికభాగం కూలిపోయినప్పటికీ ప్యాలెస్ నిర్మాణం పూర్తయినప్పుడు ఎలా ఉండేదో ఓరియంటల్ హిస్టారికల్ మాన్యుస్క్రిప్ట్స్ ఎస్.సి. హిల్స్ రచించిన 'యూసఫ్‌ఖాన్' అనే పుస్తకంలో వర్ణనాత్మకమైన ప్రస్తావనలు చాలా ఉన్నాయి. అందుకే ఆ రాజమహల్ నాలుగు శతాబ్దాల తర్వాత కూడా పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటోంది.

వింతగాథలు...


ఈ ప్యాలెస్, తిరుమల నాయకర్ గురించి వింతగొలిపే చాలా కథలు జనబాహుళ్యంలో ప్రచారంలో ఉన్నాయి. ఓ రోజు తిరుమల నాయకర్ తన సతీమణితో ఆశీనుడైనప్పుడు ఓ పులివేషగాడు చక్కగా పులిలా నృత్యం చేస్తూ ఉన్నట్టుండి పెద్దపులిని తలపించేలా కోట గోడపైభాగం వరకు ఎగిరి బయటకు దూకాడు. తిరుమల నాయకర్ ఆ కళాకారుడి ప్రతిభను మెచ్చుకుని పలు గ్రామాల్లోని భూములను దానంగా ఇచ్చి 'వాట్టిపులి' అనే బిరుదునిచ్చి సత్కరించాడు. శిలాశాసనాల పరిశోధకుడు ఎస్.బోస్, చరిత్రకారుడు వి.వేదాచలం సంయుక్తంగా రాసిన 'తిరుమలై మన్నర్' అనే గ్రంథంలో ఈ ఉదంతాన్ని ప్రస్తావించారు. అదే విధంగా ఓ ఘరానా దొంగ ఉడుము సాయంతో కోటగోడపైకి పాకుతూ వెళ్లి లోపలకు దూకి గోడకు కన్నం వేసి మరీ విలువైన వస్తువులను దోచుకెళ్లాడు. ఆ దొంగ దూకిన ప్రాంతాన్ని 'తిరుట్టు ఇడమ్' అని పిలుస్తున్నారు. ఆ ప్రాంతానికి ఇప్పటికి సంరక్షిస్తుండటం విశేషం. అయితే ఈ సంఘటనకు సంబంధించి ఎలాంటి చారిత్రక ఆధారాలు లేవు.

ప్యాలెస్ ఎక్కువ భాగం ఎలా ధ్వంసం?

తిరుమల నాయకర్ తరువాత అతడి కుమారుడు ముత్తు అళగాద్రి అలియాస్ ముత్తు వీరప్పనాయకర్ మదురైకి చక్రవర్తిగా అధికారంలోకి వచ్చి కొన్ని నెలలు మాత్రమే పరిపాలించాడు. ఆ తర్వాత ముత్తు వీరప్పనాయకర్ కుమారుడు చొక్కనాథ నాయకర్ 16 యేళ్ల ప్రాయంలో రాజయ్యాడు. ఈ కారణంగా మంత్రులు, ఉన్నతాధికారుల సలహాలను తుచ తప్పక పాటించేవాడు. అందులో భాగంగానే మంత్రుల సలహా మేరకు రాజధానిని తిరుచ్చి నగరానికి మార్చాడు. ఇది 1666లో జరిగి ఉండవచ్చు. తిరుచ్చిలో నివసిస్తున్న చొక్కనాథ నాయకర్ అక్కడ తన కోసం ప్రత్యేకంగా ఓ ప్యాలెస్ నిర్మించాలనుకున్నాడు. ఖర్చు ఆదా చేయడానికో లేక తన తాత తిరుమల నాయకర్‌కు జనబాహుళ్యంలో ఉన్న కీర్తి పట్ల అసూయతోనో అతడు మదురైలోని ప్యాలెస్‌ను పాక్షికంగా కూల్చివేసి, ఆ వస్తువులతో తిరుచ్చిలో ప్యాలెస్ నిర్మించాలని సంకల్పించాడు. ఆ మేరకు ఆదేశాలివ్వడంతో మదురై ప్యాలెస్ కూల్చివేత ప్రారంభమైంది. 'ది మదుర కంట్రీ ఎ మాన్యువల్' అనే గ్రంథ రచయిత జేహెచ్ నెల్సన్ 'ఆసియాలోనే అత్యంత అందమైన అద్భుతమైన ప్యాలెస్'గా కీర్తిగడించిన తిరుమల నాయకర్ మహల్‌ను కూల్చి బండ్ల కొద్దీ వస్తువులను తిరుచ్చి నగరానికి తరలించారు' అని చెబుతారు. చాలా నైపుణ్యంతో చెక్కిన అందమైన శిల్పాలు, నల్ల చలువరాతితో చేసిన పెద్ద పెద్ద స్తంభాలు సహా ఎన్నో కళాత్మక వస్తువులను తిరుచ్చికి తరలించడంతో మదురై ప్యాలెస్‌లోని ఎక్కువ భాగం నాశనమైంది. ఆ తరువాత 18వ శతాబ్దంలో జరిగిన కొన్ని యుద్ధాల వల్ల కూడా ఈ ప్యాలెస్ దెబ్బ తింది. 19వ శతాబ్దం ప్రారంభం నాటికి ప్యాలెస్ శిథిలావస్థకు చేరింది.

ఈ ప్యాలెస్ ప్రాంతంలో కొంతకాలం పాటు ఖైదీలు నడిపే పేపర్ మిల్లు పనిచేసింది. ఆ తర్వాత శిథిలమైన ప్యాలెస్ ప్రాంతాల్లో గుడిసెలు వేసుకుని ప్రజలు నివసించారు. ఆ సమయంలోనూ ప్యాలెస్ గోడలు కొన్ని కూలిపోయాయి. 19వ శతాబ్దం మధ్యలో ప్యాలెస్ మరింత తీవ్రంగా శిథిలావస్థకు చేరుకుంది. చాలా కుడ్యాలు కూలిపోయాయి. 1866 నుండి 1872 వరకు మద్రాసు గవర్నర్‌గా ఉన్న నేపియర్ ఈ ప్యాలెస్‌ను పునర్నించాలని సంకల్పించారు. ఆ మేరకు రూ.2లక్షల వరకు కేటాయించారు. 1872లో దెబ్బతిన్న భాగాలకు మరమ్మతులు చేయించారు. ప్యాలెస్‌లో పగుళ్లు ఏర్పడిన ప్రాంతాల్లో ఇనుపకమ్మీలు అమర్చి బలోపేతం చేశారు. సున్నపు పూత కూడా చేశారు. ప్యాలెస్ కొంతవరకు తన పాత అందాలను సంతరించుకుంది. 1886లో ఈ ప్యాలెస్ జిల్లా కలెక్టర్ కార్యాలయంగా ఉండేది. ఆ తర్వాత 1970 వరకు జిల్లా కోర్టు ఇక్కడే పనిచేసింది. 1971 నుండి ఈ ప్యాలెస్‌ను రాష్ట్ర పురావస్తు శాఖ చారిత్రక వారసత్వ సంపదగా ప్రకటించింది. ఆ తర్వాత కూడా ఈ ప్యాలెస్‌లోని స్తంభాలను కాపాడేందుకు సున్నంతో ప్లాస్టర్ చేస్తూ వస్తున్నారు. ప్యాలెస్‌లోని రెండు స్తంభాలపై ఉన్న ఆనాటి అందమైన చిత్రాలు ఇంకా చెక్కుచెదరకుండా పర్యాటకులకు విస్మయాన్ని కలిగిస్తున్నాయి.ఆ రెండు స్తంభాలను పురావస్తు పరిశోధన విభాగం అధికారులు కంటికి రెప్పలా కాపాడుతున్నారు. మదురై వెళ్ళిన పర్యాటకులు తప్పకుండా మదురై మీనాక్షి అమ్మవారి ఆలయాన్ని, ఈ తిరుమల నాయకర్ ప్యాలెస్‌ను వీక్షిస్తుండటం విశేషం.







స్వర్గవిలాసం భవనంలో ఎత్తయిన స్తంభాలపై శిల్పాకృతులు - ప్యాలెస్ ముందుభాగంలో ఉన్న స్తంభాల మంటపం - ఆనాటి శిల్పకళానైపుణ్యాన్ని చాటుతున్న ప్యాలెస్ లోపలి భాగం

వైభవంగా మాతంగేశ్వరి ఆలయ మహాకుంభాభిషేకం

ప్యారీస్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక ట్రిప్లికేన్ లాయిడ్స్ రోడ్డులోని మాతంగేశ్వరి ఆలయ మహాకుంభాభిషేకం శనివారం ఘనంగా నిర్వహించారు. స్వతంత్ర నగర్ ఆదిఆంధ్ర ప్రజా సంక్షేమ సంఘం నిర్వాహకుల పర్యవేక్షణలో తెల్లవారుజాము నుంచి విశేష పూజలు జరిగాయి. అనంతరం గణపతి ఉపనిషత్తు పారాయణం సహా అమ్మవారి అష్టోత్తరం, మహా పూర్ణాహుతితో నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెంకు చెందిన ఫణికులశర్మ బృందం మూడు రోజుల యాగశాల పూజలు పూర్తిచేశారు. ఉదయం 8 గంటలకు ఆలయ ప్రాంగణంలో ఉత్సవమూర్తుల విగ్రహాలు కొలువుదీర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మూలవర్లకు అభిషేకం, పరివార దేవతలు, ఆలయ గోపుర కలశాలకు పుష్కర మహాకుంభాభిషేకం నిర్వహించి, పవిత్ర జలాలను భక్తులపై సంప్రోక్షించారు. సంఘ అధ్యక్షులు మొండెం కృష్ణమూర్తి, కార్యదర్శి ఉద్దాల హరి, కోశాధికారి కాకి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు టీఎల్ వెంకటయ్య అలియాస్ అబ్బుల్, డిప్యూటీ సెక్రటరీ కప్పల విష్ణుప్రసాద్, గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు, యువత, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.. రూ.10 లక్షలతో పూర్తిచేసిన జీర్ణోద్ధరణ పనులు, కుంభాభిషేకానికి సహకరించిన వారిని ఈ సందర్భంగా సత్కరించి, భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.



మహా పూర్ణాహుతిలో ఆదిఆంధ్ర ప్రజా సంక్షేమ సంఘం నిర్వాహకులు



పాల్గొన్న భక్తులు



సదస్సులో వైద్య ప్రముఖులు

అంతర్జాతీయ ఆరోగ్య సంరక్షణ సదస్సుకు విశేష స్పందన

చెన్నై, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోరూర్‌లోని 'శ్రీ రామచంద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్'లో 'అంతర్జాతీయ ఆరోగ్య సంరక్షణ'పై జరిగిన సదస్సుకు విశేష స్పందన లభించింది. దేశవిదేశాలకు చెందిన 300 మందికిపైగా బోధనాధ్యాపకులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు. తమిళనాడు నర్సింగ్ అండ్ మిడ్ వైఫ్స్ కౌన్సిల్, శ్రీ రామచంద్ర ఫ్యాకల్టీ ఆఫ్ నర్సింగ్ సహకారంతో ఈ సదస్సు నిర్వహించారు. యూకేలోని ఏఎస్‌పీఐహెచ్ ప్రెసిడెంట్ కోలెట్ లాస్ చాప్‌మ్యాన్, తమిళనాడు నర్సెస్ అండ్ మిడ్‌వైఫ్స్ కౌన్సిల్ రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్.అనిగ్రేస్ కళైమతి, యూకేకు చెందిన డాక్టర్ మకని పూర్వ ఈ సదస్సును లాంఛనంగా ప్రారంభించారు. ప్రపంచవ్యాప్తంగా వున్న సీనియర్ వైద్య నిపుణులు ఈ సదస్సులో తమ ఆలోచనల్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్టిట్యూట్ వైస్‌ఛాన్స్‌లర్ డాక్టర్ ఉమా శేఖర్, నర్సింగ్ ఫ్యాకల్టీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌జే నళిని తదితరులు పాల్గొన్నారు.

సీఎంసీ అనాటమీ ఆధ్వర్యంలో ఎగ్జిబిషన్

వేలూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక సీఎంసీ వైద్య కళాశాల అనాటమీ విభాగం ఆధ్వర్యంలో స్థానిక ఉన్నత పాఠశాలలో ప్రత్యేక ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఎగ్జిబిషన్‌ను ఉదవుమ్ ఉల్లంగళ్ అధ్యక్షుడు చంద్రశేఖరన్ ప్రారంభించారు. కార్యక్రమంలో మానవ శరీరంలో అవయవాలు, ఎముకలపై విద్యార్థులకు వివరించారు. మాదకద్రవ్యాలకు లోనుకాకుండా ఆరోగ్యం సంరక్షించుకోవాలని విద్యార్థులకు సూచించారు.



ఎగ్జిబిషన్ తిలకిస్తున్న విద్యార్థులు

గరుడ ఏరోస్పేస్ ఆధ్వర్యంలో అధునాతన రక్షణ వ్యవస్థలు

చెన్నై, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): 'గరుడ ఏరోస్పేస్' సంస్థ నూతనగా ఏర్పాటు చేసిన రక్షణ డ్రోన్ సదుపాయాన్ని రక్షణశాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్ శుక్రవారం చెన్నైలో ప్రారంభించారు. అంతేగాక ఐదు అధునాతన యూఏవీ వ్యవస్థలను కూడా ఆవిష్కరించారు. అవలాంచ్ విక్టిమ్ డ్రోన్, స్వార్మ్ డ్రోన్, జవాన్ డ్రోన్, కానిస్టర్ డ్రాపింగ్ డ్రోన్, డ్రోని 2.0 పేర్లతో వున్న ఐదు వ్యవస్థలను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... స్వదేశీ డ్రోన్ సాంకేతికత అభివృద్ధి చేయడంలో, భారతదేశ రక్షణ సామర్థ్యాలను బలోపేతం చేయడంలో, 'ఆత్మ నిర్భర్ భారత్' దార్శనికతను నడిపించడంలో గరుడ ఏరోస్పేస్ అచంచలమైన నిబద్ధతను నొక్కి చెబుతోందన్నారు. అదే విధంగా కార్యక్రమంలో భాగంగా భారత రక్షణ సంసిద్ధత, డ్రోన్ టెక్నాలజీ పరిణామానికి గరుడ ఏరోస్పేస్ ప్రయాణం, కీలక మైలురాళ్లు, సహకారాలను హైలెట్ చేస్తూ రూపొందించిన 'గరుడ రక్షా ఉడాన్ 2025' పుస్తకాన్ని కూడా కేంద్రమంత్రి ఆవిష్కరించారు. తన పరిశోధన, అభివృద్ధి పర్యావరణ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తూ, మిషన్-నిర్దిష్ట అవసరాల కోసం వికేంద్రీకృత ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి 13జేఏకే రైఫిల్స్ సహకారంతో డిఫెన్స్ డ్రోన్ ల్యాబ్ ఏర్పాటు చేస్తున్నట్లు ఈ సందర్భంగా గరుడ ఏరోస్పేస్ ప్రకటించింది.



యూఏవీ వ్యవస్థలు ఆవిష్కరిస్తున్న కేంద్రమంత్రి

చిత్రజ్యోతి



రజనీకాంత్‌తో సిమ్రన్

కాలం మారినా చెరిగిపోనివి....!

● సూపర్‌స్టార్‌తో భేటీపై సిమ్రన్ ట్వీట్

సూపర్ స్టార్ రజనీకాంత్‌కు కలుసుకున్నప్పటి చిత్రాన్ని నటి సిమ్రన్ తన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. కోలీవుడ్ సీనియర్ నటి సిమ్రన్ ఇటీవల సూపర్ స్టార్ రజనీకాంత్‌ను ఆయన స్వగృహంలో కలుసుకున్నారు. రజనీకాంత్‌తో ఉన్న ఫొటోను ఎక్స్‌లో పోస్ట్ చేసిన సిమ్రన్... 'కొన్ని ఘటనలు కాలం మారినా చెరిగిపోనివి' అనే కామెంట్ జతచేశారు. సిమ్రన్ చివరగా 'టూరిస్ట్ ఫ్యామిలీ' చిత్రంలో నటించారు. చిన్న బడ్జెట్‌తో రూపొందిన ఈ చిత్రం బాక్సాఫీసు వద్ద భారీ విజయం నమోదుచేసింది. మరోవైపు రజనీకాంత్ నటించిన 'కూలీ' చిత్రం ఈ నెల 14వ తేది విడుదలై బాక్సాఫీసు వద్ద మంచి విజయం నమోదుచేసింది.

తనకు తానే పోటీ అంటున్న ప్రదీప్

● దీపావళికి రెండు చిత్రాలు



నటుడు ప్రదీప్ రంగనాథన్ నటించిన రెండు చిత్రాలు ఒకేరోజు విడుదల కానున్నాయి. దీపావళి సందర్భంగా ప్రదీప్ నటించిన 'డూడ్, 'ఎల్ఐకే' చిత్రాలు ప్రేక్షకుల చెంతకు రానున్నాయి. 'కోమాలి', 'లవ్ టుడే' చిత్రాలకు దర్శకత్వం వహించిన ప్రదీప్ రంగనాథన్, లవ్ టుడే చిత్రంలో హీరోగా నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. అతను నటించిన 'డ్రాగన్' చిత్రం కూడా విజయం సాధించింది. ప్రస్తుతం ఎల్ఐకే (లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ), డూడ్ అనే రెండు చిత్రాలు రూపొందుతున్నాయి. డైరెక్టర్ విఘ్నేష్ శివన్ ఎల్ఐకే చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో హీరోయిన్‌గా కీర్తి శెట్టి, ప్రధాన పాత్రలో ఎస్‌జే సూర్య నటిస్తున్నారు. అలాగే, 'డూడ్' చిత్రం ద్వారా కీర్తీశ్వరన్ దర్శకుడిగా పరిచయం కానున్నాయి. ఈ చిత్రంలో మమిత బైజూ హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ క్రమంలో, ఈ రెండు చిత్రాలు దీపావళి సందర్భంగా అక్టోబరు 17వ తేది విడుదల కానున్నాయి. కాగా, తమిళం, తెలుగులో రూపొందుతున్న 'డూడ్' చిత్రం తొలి సాంగ్ ఈ నెల 28వ తేది విడుదల చేస్తున్నట్లు చిత్ర యూనిట్ తెలియజేసింది.

'మార్షల్' చిత్రంలో విలన్‌గా ఆది



నటుడు కార్తీ 'వా వాద్దియార్', 'సర్కార్-2' చిత్రాల షూటింగ్ పూర్తికాగా, ప్రస్తుతం తమిళ్ దర్శకత్వంలో రూపొందిన 'మార్షల్' చిత్రంలో నటిస్తున్న కార్తీకి జోడీగా కల్యాణి ప్రియదర్శిని నటిస్తోంది. చిత్రంలోని ముఖ్య సన్నివేశాలు ప్రస్తుతం తీరప్రాంత జిల్లాల్లో చిత్రీకరిస్తున్నారు.ఈ చిత్రంలో విలన్‌గా నటించేందుకు మలయాళ నటుడు నవీన్ బాలీని సంప్రదించగా, ఆయన 'కాల్షీట్లు' సమస్య కారణంగా నటించలేకపోయారు. ప్రస్తుతం ఆ పాత్రకి నటుడు ఆదిని ఎంపిక చేసినట్లు సమాచారం. తమిళంలో 'మృగం', 'ఈరం', 'అరవాన్', 'మరకథ నాణయం', 'శపథం' తదితర చిత్రాల్లో హీరోగా నటించిన ఆది, విలన్‌గా నటించడం ఇదే మొదటిసారి.

తూత్తుకుడి నుంచి అమెరికాకు

విండ్ టర్బైన్ బ్లేడ్లు

పెరంబూర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి నుంచి అమెరికాకు సరుకుల నౌకలో 101 విండ్ టర్బైన్ బ్లేడ్లు ఎగుమతి చేశారు. తూత్తుకుడి వాఊసీ హార్బర్ విండ్ టర్బైన్ బ్లేడ్లు ఎగుమతులకు తగినంత స్థలం అందుబాటులో ఉంది. ఈ క్రమంలో, గురువారం ఒకే నౌకలో 101 విండ్ టర్బైన్ బ్లేడ్లు ఎగుమతి చేసి సరికొత్త రికార్డు సృష్టించారు. 59.16 మీ పొడవున్న విండ్ టర్బైన్ బ్లేడ్లు 'ఎంవీ బీటీసీ శాంటియాగో' అనే నౌక ద్వారా అమెరికాకు ఎగుమతి చేశారు. ఇంతకు ముందు ఒక నౌకలో 75 విండ్ టర్బైన్ బ్లేడ్లు ఎగుమతి చేసినట్లు హార్బర్ అధికారులు తెలిపారు.



శ్రీవారి సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి


జస్టిస్ సంజయ్ కరోల్

తిరుమల, ఆగస్టు23 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కరోల్ శనివారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. రంగనాయక మండపంలో జస్టిస్‌కు వేదపండితులు ఆశీర్వచనం చేయగా అధికారులు లడ్డూ ప్రసాదాలు అందజేశారు.

సూర్యఘర్ లబ్ధిదారులను ప్రోత్సహించండి

తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు23(ఆంధ్రజ్యోతి): సదరన్ డిస్కం పరిధిలో ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకం లబ్ధిదారుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి వారిని ప్రోత్సహించాలని సదరన్ డిస్కం సీఎండీ కె.సంతోష రావు రెవెన్యూ ఉద్యోగులను ఆదేశించారు. సదరన్ డిస్కం కార్యాలయంలోని సమావేశ మందిరంలో శనివారం డిస్కంలోని 9 జిల్లాల రెవెన్యూ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం సూర్యఘర్ పథకం వల్ల సంస్థపై విద్యుత్ కొనుగోలు భారం తగ్గుతుందన్నారు. సూర్యఘర్ పథకం వినియోగదారుల సర్వీసులకు సంబంధించిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన రాయితీ వినియోగదారులకు ఉపయోగపడుతోందని, సంస్థకు విద్యుత్ చౌకగా లభిస్తోందని తెలిపారు. తొమ్మిది జిల్లాల్లో విద్యుత్ సర్వీసులకు ఆధార్ అనుసంధానం తప్పనిసరిగా ఉండాలన్నారు. విద్యుత్ బకాయిలు 100 శాతం వసూలు చేయాలన్నారు. మొండి బకాయిల వసూలుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. అంతకు ముందు సంస్థ రెవెన్యూ విభాగం చీఫ్ జనరల్ మేనేజరు కె.ఆర్.ఎస్.ధర్మజ్ఞాని విద్యుత్ రెవెన్యూ వసూలు అంశాలపై సమీక్ష చేశారు. 9 జిల్లాల ఎస్ఏవోలు, ఏవోలు, ఏఏవోలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సీఎండీ సంతోసరావు

సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 27 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం: రూ.4.75 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 72,067

తలనీలాలు సమర్పించినవారు: 25,212



ఆదివారం ప్రత్యేకం

వైకల్యాన్ని ఓడించాడు

కొందరు చిన్న కష్టం ఎదురైతేనే నిరాశ చెందుతారు. జీవితాన్నే కోల్పోయినట్లు భావిస్తారు. కానీ అన్వేష్ అలా కాదు. ప్రమాదవశాత్తూ ఒక చెయ్యి పోయినా ఆత్మవిశ్వాసాన్ని వీడలేదు. వైకల్యంగా భావించలేదు. తనలోని క్రీడా సంకల్పాన్ని చెక్కు చెదరనివ్వలేదు. ఒంటిచేత్తోనే బతుకుబండి నడుపుతున్నాడు. మరోపక్క తాను ప్రాణానికి ప్రాణంగా భావించే క్రీడల్లోనూ రాణిస్తూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాడు. నిరంతర సాధనతో సాధ్యం కానిదేదీ లేదంటూ నిరూపిస్తూ స్ఫూర్తిని చాటుతున్నాడు..

\- గూడూరు, ఆంధ్రజ్యోతి





ఒంటిచేతితో రాణిస్తున్న అన్వేష్

క్రీడల్లో స్ఫూర్తిదాయక విజయ ప్రస్థానం


బంగ్లాదేశ్‌లో జరిగిన పోటీలలో ప్రతిభాపురస్కారాన్ని అందుకుంటున్న అన్వేష్

గూడూరుకు చెందిన అన్వేష్ పురుషోత్తమ్

గూడూరు పట్టణంలోని కోనేటిమిట్టకు చెందిన మరియమ్మ, కృష్ణయ్య దంపతుల కుమారుడు అన్వేష్ పురుషోత్తమ్. రెక్కాడితేగాని డొక్కాడని కుటుంబ నేపథ్యం. చదువుతో పాటు క్రీడలంటే కూడా ఇష్టం. వాకాడు గురుకుల పాఠశాలలో చదువుతున్నప్పుడు సాఫ్ట్‌బాల్, రెజ్లింగ్, షాట్‌పుట్, వాలీబాల్‌లలో శిక్షణ పొందాడు. విశేష ప్రతిభ కనబరిచాడు. జిల్లా, రాష్ట్రస్థాయిలో విజేతగా నిలిచాడు. నెల్లూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా చదివాక గూడూరులోని ఓ పరిశ్రమలో చిరుద్యోగంలో చేరాడు. 2011లో పెళ్లయిన అన్వేష్‌కు పాప, బాబు ఉన్నారు. 2014లో దురదృష్టం వెంటాడింది. పరిశ్రమలో జరిగిన ఓ సంఘటన అన్వేష్‌ను అంగవికలుడ్ని చేసింది. కుడి చేయిని కోల్పోయాడు. రెండేళ్లపాటు ఆటుపోట్లు ఎదుర్కొన్నాడు. కొద్దిగా కోలుకున్నాక మనసు మళ్లీ క్రీడలమీదకు మళ్లింది. ఇందుకోసం ఒంటిచేతితోనే కఠోర సాధన చేశాడు. క్రీడా నైపుణ్యానికి పదునుపెట్టాడు. షటిల్, షాట్‌పుట్, క్రికెట్ వంటి క్రీడలతో పాటు పలు అథ్లెటిక్స్ ఆడటంలో సఫలీకృతుడయ్యాడు. నైరాశ్యాన్ని తరిమేసి దివ్యాంగుల క్రీడాపోటీల్లో పాల్గొనడం మొదలుపెట్టాడు. జాతీయస్థాయిలో పారా అథ్లెటిక్స్‌లో ప్రతిభ చాటి ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేసుకున్నాడు. అంతర్జాతీయ పారా క్రికెట్ క్రీడల పోటీల్లో మన దేశం తరఫున ప్రాతినిధ్యం వహించి సత్తా చాటాడు.

సాధించిన విజయాల్లో కొన్ని..

● 2020లో విశాఖపట్నం 2021లో అనంతపురం, 2022లో కాకినాడ, 2023లో విశాఖట్నంలలో జరిగిన రాష్ట్రస్థాయి దివ్యాంగుల పోటీల్లో స్వర్ణ, రజత పతకాలు సాధించాడు. 2021లో తిరుపతిలో జరిగిన జాతీయస్థాయి క్రికెట్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ ప్రదర్శించి జాతీయ జట్టుకు ఎంపికయ్యాడు. ● 2023లో భారత్-బంగ్లాదేశ్ టీ-20 పోటీల్లో జట్టులో కీలక పాత్ర పోషించాడు. ఫలితంగా దివ్యాంగుల క్రికెట్ అసోసియేషన్ బోర్డులో సభ్యత్వం సాధించాడు. అదేఏడాది బెంగళూరు అంతర్జాతీయ పోటీల్లో పలు పతకాలను గెల్చుకున్నాడు. కోయంబత్తూరు ఐపీసీయల్ క్రికెట్ పోటీల్లో జట్టు విజయానికి దోహదపడ్డాడు. నేపాల్‌తో జరిగిన టీ-20, వన్‌డే సీరిస్‌ల్లో భారత్ విజయం వెనుక బలమైన పాత్ర పోషించాడు. అన్వేష్ సాధించిన క్రీడా విజయాలకు ప్రోత్సాహకరంగా పలు పురస్కారాలను అందుకున్నాడు.

చేయూత ఇవ్వండి..

పోటీలకు వెళ్లాలని ఉత్సాహమున్నా ఆర్థిక స్తోమత ప్రతిబంధకమవుతోంది. సొంతంగా నిధులు సమకూర్చుకోవడం కష్టంగా ఉంటోంది. అంతర్జాతీయస్థాయి పోటీలకు వెళ్లాలంటే ఖర్చు చాలానే అవుతుంది. దాతలు లేదా ప్రభుత్వం కాస్త ప్రోత్సాహాన్ని అందిస్తే మరిన్ని విజయాలను సాధిస్తా.

\- అన్వేష్ పురుషోత్తమ్

‘మఠం’ భవనాన్ని పూర్తిగా కూల్చం

● దెబ్బతిన్న చోటే పునర్నిర్మాణం ● ఐఐటీ నివేదికను అనుసరిస్తాం ● మరోసారి సమావేశమై తుదినిర్ణయం ● భవనాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే, కలెక్టర్, కమిషనర్

తిరుపతి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని హాథిరాంజీ మఠం భవనాన్ని పూర్తిగా కూల్చబోమని కలెక్టర్ వెంకటేశ్వర్ స్పష్టంచేశారు. కుంగిన, పగుళ్లు వచ్చిన ప్రాంతాల్లో మాత్రమే కూల్చడమా? లేదా రెట్రోఫిటింగ్ రీకన్‌స్ట్రక్షన్ చేయడమా? అనేది మరో నాలుగురోజుల్లో నిర్ణయం తీసుకుంటామన్నారు. ఐఐటీ నివేదిక ఆధారంగా ప్రజలకు ప్రాణనష్టం కలగకుండా చర్యలు చేపడతామన్నారు. తిరుపతి గాంధీరోడ్డులోని హాథిరాంజీ మఠం భవనాన్ని శనివారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కమిషనర్ మౌర్యతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ‘హాథిరాంజీ మఠానికి 125ఏళ్ల చరిత్ర ఉంది. కాలక్రమంలో ఇక్కడ దేవదాయశాఖ ఆర్జేసీ కార్యాలయం, మఠం పరిపాలన, సుమారు 60 షాపులకుపైగా అద్దెకు ఇచ్చారు. నిర్వహణ సరిగాలేక భవనం శిథిలావస్థకు చేరింది. ఏడేళ్లుగా కార్పొరేషన్‌కు తరచూ ఫిర్యాదులు వచ్చాయి. దురదృష్టవశాత్తు ఏదైనా జరిగితే ప్రాణనష్టం కలిగే అవకాశం ఉండటంత మఠం వాళ్లు దేవదాయశాఖకు లేఖ రాశారు. ఐఐటీ నిపుణులు భవనాన్ని పరిశీలించారు. పగుళ్లు, కుంగిపోయిన ప్రదేశాలను చూసి ప్రాణనష్టం జరిగే అవకాశం ఉందని వారు నివేదకలో స్పష్టంగా తేల్చారు. హాథిరాంజీ మఠం భవనాన్ని పూర్తిగా కూల్చివేస్తామన్నది అపోహమాత్రమే. మఠానికి తూర్పు, ఉత్తరం, దక్షిణ ప్రాంతాల్లో కొన్నిచోట్ల పగుళ్లు, కుంగిపోవడం వల్ల భవనం శిధిలావస్థకు చేరింది. ఎవరికీ ప్రాణం నష్టం జరగకూడదనేదే ప్రభుత్వం ఉద్దేశం. ఈ మఠం బంజారా కమిటీకి సెంటిమెంటుతో కూడినదని వారి మనోభావాలను దెబ్బతీసే అవకాశం ఉండదు’ అని తెలిపారు. భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా.ఇక్కడి వారికి ఎలాంటి ప్రమాదం జరగకుండా చూడాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించిందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. అందులో భాగంగానే ఇక్కడ పరిస్థితులను పరిశీలించామన్నారు.భవనాన్ని పూర్తిగా కూల్చి వేస్తామని మీడియాలో వస్తున్న ప్రచారం అబద్ధమన్నారు. ఐఐటీ నిపుణుల నివేదిక మేరకు నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీజీబీసీ చైర్‌పర్సన్ సుగుణమ్మ, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, హస్తకళల చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్, డిప్యూటీ మేయర్లు ఆర్సీ మునికృష్ణ, ముద్ర నారాయణ, మఠం ఏవో బాపిరెడ్డి, ఆర్డీవో రామ్మోహన్, ఏపీ యూఐడీసీ డైరెక్టర్ ఊకా విజయకుమార్, కార్పొరేటర్లు నరసింహాచారి, నరేంద్ర కూటమినేతలు బిఎల్ సంజయ్, మబ్బు దేవనారాయణరెడ్డి, శ్రీధర్ వర్మ, పుష్పావతి, ఆముదాల తులసీరాం, రాజా రెడ్డి, వినోద్ రాయల్ తదితరులు పాల్గొన్నారు.


మఠం భవనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, అధికారులు

మఠం భవనం కూల్చొద్దు

● హథీరాంజీ మఠంలో బంజారా సాధువులు, భక్తుల నిరసన



తిరుపతి(కల్చరల్), ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): హథీరాంజీ మఠం భవనాన్ని కూల్చొద్దంటూ బంజరా మహంతు, హథీరామ్ బాబాజీ మహాసంఘ్ సభ్యులు శనివారం నిరసనకు దిగారు. మఠం భవనాల పరిశీలనకు ఎమ్మెల్యే శ్రీనివాసులు, కలెక్టర్ వెంకటేశ్వర్ వస్తున్నారనే సమచారంతో వీరంతా ఇక్కడికి చేరుకున్నారు. వెంకటేశ్వరస్వామి పరమభక్తుడు హథీరాంజీ జ్ఞాపకాలకు గుర్తు ఈ మఠం భవనమని పేర్కొన్నారు. పురాతన ఈ కట్టడాన్ని పరిరక్షించి భావితరాలకు అందించాలని కోరారు. కూల్చాలనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని, ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఆ సంఘ సభ్యులతో కలెక్టర్ చర్చించారు. మఠం జ్ఞాపకాలను చెరపడం లేదని, అనుకోని ప్రమాదం సంభవిస్తే ఎలాంటి నష్టం కలగకూడదనే ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ వివరించారు.

స్విమ్స్ వర్సిటీ పీజీ కోర్సుల అడ్మిషన్ల గడువు పొడిగింపు

తిరుపతి(వైద్యం), ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): స్విమ్స్ యూనివర్సిటీలో ఈ విద్యా సంవత్సరానికి పీజీ కోర్సుల అడ్మిషన్ల గడువు సెప్టెంబరు 5 వరకు పొడిగిస్తున్నట్లు రిజిస్ట్రారు అపర్ణ బిట్లా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎస్సీ నర్సింగ్, ఎంపీటీ, ఎంఎస్సీ అల్లైడ్ హెల్త్‌సైన్సెస్, ఎంఎస్సీ క్లీనికల్ వైరాలజీ, ఎంఎస్సీ క్లీనికల్ సైకాలజీ వంటి పీజీ కోర్సులతోపాటు స్పెషలైజేడ్ నర్సింగ్ కోర్సులకు ఈనెల 1న నోటిఫికేషన్ విడుదల చేశారు. పూర్తి వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని ఆమె సూచించారు.

నేడు ఏపీపీఎస్సీ డిపార్ట్‌మెంటల్ పరీక్ష

- హాజరు కానున్న 1,450 మంది అభ్యర్థులు -


మాట్లాడుతున్న డీఆర్వో నరసింహులు

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏపీపీఎస్సీ కంప్యూటర్ డిపార్ట్‌మెంటల్ పరీక్ష(గ్రామ సర్వేయర్ల)కు ఏర్పాట్లు చేసినట్లు డీఆర్వో నరసింహులు తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్షించారు. పరీక్షలు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరుగుతాయని, 1,450మంది అభ్యర్థులు హాజరవుతారని వెల్లడించారు. మొత్తం మూడు కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదన్నారు. పరీక్షలను పగడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అధికారులు రాజగోపాల్, జగదీష్, యోగేష్ పాల్గొన్నారు.

కర్ణాటక జంట ఆత్మహత్య

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రం వడ్డగిరికి చెందిన జంట తిరుపతిలోని ఒక లాడ్జిలో శనివారం ఆత్మహత్య చేసుకున్నారు. ఈస్ట్ ఎస్ఐ హేమాద్రి వివరాల మేరకు.. వడ్డగిరికి చెందిన వెంకటరాజు(34), అనుష(25) ఇంటి నుంచి పారిపోయి శుక్రవారం తిరుపతికి వచ్చారు. శ్రీవారి దర్శనానికి వచ్చినట్లు చెప్పి స్థానిక శివకృష్ణ లాడ్జిలో రూము అద్దెకు తీసుకున్నారు. రెండు రోజులుగా వారు బయటకు రాక పోవడంతో అనుమానం వచ్చి గది తాళాలు పగులకొట్టి చూశారు. ఇద్దరూ ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని కనిపించారు. వెంటనే లాడ్జి మేనేజర్ ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ హేమాద్రి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. మృతికి గల కారణాలు తెలియలేదని, బెంగళూరులోని చామరాజుపేట రూరల్ పోలీసు స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదై ఉందని చెప్పారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.


వెంకటరాజు, అనుష మృతదేహాలు

ఆ అరగంటలోనే నగలు ఎత్తుకెళ్లారు

● 80 గ్రాముల ఆభరణాల చోరీపై కేసు నమోదు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఇంట్లోని టీవీ వెనుక కప్‌బోర్డులో 80 గ్రాముల బంగారు నగలు ఉంచారు. 20వ తేది చూస్తే ఉన్నాయి. శుక్రవారం ఉదయం చూస్తే లేవు. 20వ తేదీన మధ్యాహ్నం షాపునకు వెళ్లొచ్చిన అరగంట వ్యవధిలోనే దొంగతనం చేసుంటారని భావించారు. దీనిపై శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు కథనం మేరకు.. దుర్గసముద్రంలో పత్తి మునెమ్మ, రామచంద్రయ్య దంపతులు ఉంటున్నారు. ఈ నెల 20న మధ్యాహ్నం 3 గంటలకు రామచంద్రయ్య తన అక్క ఇంటికి వెళ్లారు. 3.30 గంటల సమయంలో మునెమ్మ ఆకు వక్క తీసుకురావడానికి ఇంటికి తాళమేసి, తలుపు పక్కన బ్యాగులో ఆ తాళాలు ఉంచి వెళ్లారు. అరగంట తర్వాత ఆమె తిరిగొచ్చారు. తలుపునకు తాళం వేసుండటంతో ఎలాంటి అనుమానం రాలేదు. శుక్రవారం ఉదయం చూడగా టీవీ వెనుక ఉంచిన దాదాపు 80 గ్రాముల బంగారు ఆభరణాలు కనిపించలేదు. ఇళ్లంతా వెదికారు. ఎక్కడా కనిపించక పోవడంతో శనివారం రూరల్ సీఐ చిన్నగోవిందును కలసి ఫిర్యాదు చేశారు. ఎస్ఐ షేక్‌షావలి కేసు నమోదు చేశారు. ఘటనా స్థలాన్ని డీఎస్పీ ప్రసాద్, సీఐ చిన్నగోవిందు, ఎస్ఐ షేక్ షావలి, పోలీసులు, డాగ్, వేలి ముద్రలు నిపుణులు పరిశీలించారు. ఇప్పటికే అవసరమైన సాక్ష్యాధారాలు సేకరించిన పోలీసులకు కేసులో కొన్ని ఆధారాలు లభించినట్లు తెలిసింది.


చోరీ జరిగిన ఇంటిని పరిశీలించి బాధితురాలితో మాట్లాడుతున్న డీఎస్పీ

ఎరువుల దుకాణాలపై విజిలెన్సు దాడులు

● 577 యూరియా బస్తాల సీజ్



తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ఎరువుల దుకాణాలపై శనివారం విజిలెన్సు దాడులు చేపట్టారు. రైతులకు అందాల్సిన ఎరువులు పక్కదారి పడుతున్న వైనంపై తిరుపతి ప్రాంతీయ విజిలెన్సు ఎస్పీ కరీముల్లా షరీఫ్ ఆదేశాల మేరకు డీఎస్పీ మల్లికార్జునరావు నేతృత్వంలో సీఐలు వెంకటరవి, చంద్రశేఖర నాయక్, విజిలెన్సు ఏవో రామాంజనేయులు, సిబ్బంది ఈ దాడులు నిర్వహించారు. గూడూరులో సాయి బాలాజీ రైతు డిపోలో 577 యూరియా బస్తాలు సీజ్ చేశారు.

తిరుపతి పార్లమెంటు టీడీపీ కమిటీకి కసరత్తు

● 26న రేణిగుంట వై కన్వెన్షన్ హాలులో సమావేశం

● పరిశీలకులుగా మంత్రి సవిత సహా ఇద్దరు కార్పొరేషన్ల ఛైర్మన్లు

తిరుపతి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ తిరుపతి పార్లమెంటు కమిటీ ఏర్పాటుకు ఎట్టకేలకు కసరత్తు ప్రారంభమైంది. ఈనెల 26వ తేదీన మంగళవారం తిరుపతి పార్లమెంటు కమిటీ ఏర్పాటు కోసం ప్రత్యేక సమావేశం జరగనుంది. పార్లమెంటు కమిటీ ఏర్పాటుపై చర్చించి, సమావేశం సజావుగా జరిగేలా చూసేందుకు అధిష్ఠానం ముగ్గురు పరిశీలకులను నియమించింది. ఆ మేరకు బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత, ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజు, ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ బుచ్చి రామ్‌ప్రసాద్‌లు పరిశీలకులుగా నియమితులయ్యారు. 26న రేణిగుంటలోని వై కన్వెన్షన్ హాలులో ఉదయం 10 నుంచీ సాయంత్రం 5 వరకూ సమావేశం జరగనుంది. దీనికి పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మొదలుకుని జాతీయ, రాష్ట్ర కమిటీలలోని ప్రతినిధులు, రాష్ట్ర అనుబంధ కమిటీల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, ప్రస్తుత జిల్లా కమిటీ, జిల్లా అనుబంధ కమిటీల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, ఎమ్మెల్యేలు, ఇంచార్జులు, డిప్యూటీ మేయర్లు, కార్పొరేషన్ల ఛైర్‌పర్సన్లు, డైరెక్టర్లు, నామినేటెడ్ పదవుల్లో వున్న వారు... ఇలా సుమారు 200 మంది దాకా ప్రతినిధులు హాజరు కానున్నారు. పరిశీలకుల ఆధ్వర్యంలో జరిగే సమావేశంలో పార్లమెంటు కమిటీలోని 34 పదవులకు, అలాగే రాష్ట్ర కమిటీకి ఆయా నియోజకవర్గాల నుంచీ ఆశావహుల జాబితాలను ఎమ్మెల్యేలు, ఇంఛార్జులు పార్టీ పరిశీలకులకు అందజేయనున్నారు. ముఖ్యంగా పార్లమెంటు కమిటీకి సంబంధించి ప్రధాన సామాజికవర్గాలతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, మహిళలకు తగిన ప్రాతినిధ్యం వుండేలా, అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకూ ప్రాతినిధ్యం వుండేలా జాగ్రత్త వహించనున్నారు. పార్లమెంటు, రాష్ట్ర కమిటీలలో వివిధ పదవులను ఆశిస్తున్న వారి జాబితాలను, ఎమ్మెల్యేలు, ఇంచార్జులు సిఫారసు చేసిన జాబితాలను పరిశీలకులు అదే రోజు సాయంత్రం అధిష్ఠానానికి పంపించనున్నారు. ఈ నెలాఖరులోపే పార్లమెంటు కమిటీని అధిష్ఠానం ప్రకటించే అవకాశముంది.

నేటి నుంచి అమరావతి చాంపియన్‌షిప్ కప్ పోటీలు

● మైదానాల్లో విస్తృత ఏర్పాట్లు



తిరుపతి(క్రీడలు), ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): అమరావతి చాంపియన్‌షిప్ కప్ రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. మూడు రోజులపాటు జరిగే పోటీల ఏర్పాట్లను శాప్ ఛైర్మన్ అనిమిని రవి నాయుడు పర్యవేక్షిస్తున్నారు. ఎస్వీయూ మైదానంలో అథ్లెటిక్స్, ఖోఖో, ఎస్వీయూ క్యాంపస్‌లో బాక్సింగ్, వెయిట్‌లిఫ్టింగ్, బాస్కెట్‌బాల్, ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్ క్యాంపస్‌స్కూల్ వద్ద వాలీబాల్, ఆర్చరీ, శ్రీనివాస క్రీడా సముదాయంలో కబడ్డీ, బ్యాడ్మింటన్, ఎస్వీఆర్ట్స్ కాలేజీ మైదానంలో హాకీ పోటీలు జరుగుతాయి. వివిధ జిల్లాల నుంచి క్రీడాకారులు, కోచ్‌లు, మేనేజర్లు, అధికారులు మొత్తం 1,700మంది ఆదివారం ఉదయానికి చేరుకుంటారు. ఎస్వీయూ, మహిళా వర్సిటీలలో వసతుల కు సంబంధిచి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఎస్వీయూ మైదానంలో ప్రారంభ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రవాణా, క్రీడల శాఖామంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కలెక్టర్ వెంకటేశ్వర్, ు హాజరుకానున్నారు.

పొలంలోకి దూసుకెళ్ళిన స్కూల్ బస్సు

● విద్యార్థులు సురక్షితం


పొలంలోకి దూసుకెళ్ళిన దృశ్యం

చంద్రగిరి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పుల్లయ్యగారిపల్లె సమీపంలో స్కూల్ బస్సు అదుపు తప్పి పొలంలోకి దూసుకెళ్లింది. అదృష్టవశాత్తూ విద్యార్థులెవరికీ ఏమీ కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. క్షేమంగా బయటపడ్డారు. శనివారం ఉదయం చంద్రగిరిలోని ఓ ప్రైవేటు స్కూల్‌కు చెందిన బస్సు పుల్లయ్యగారిపల్లె నుంచి చంద్రగిరికి వస్తోంది. దారిలో ఆటో ఎదురుగా రావడంతో బస్సు అదుపు తప్పి రోడ్డు పక్కనున్న పొలంలోకి దూసుకెళ్ళింది. విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. తమకు ఎలాంటి సమాచారం అందలేదని పోలీసులు తెలిపారు.